RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:224 బుధవారం 23 సెప్టెంబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

## రిపోర్టర్లు కావలెను


జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098



# ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్నిప్రమాదం

## ముగ్గురు నవజాత శిశువుల మృతి

- ఎస్ఎన్ సీయూ వార్డులో షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- ఘటనపై విచారణకు ఆదేశించిన సీఎం .. బాధితులకు పరామర్శ
- హెలికాప్టర్‌లో రిమ్స్‌ను సందర్శించి భద్రతా ఆడిట్‌కు ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ

వివరాలు 2వ పేజీలో



## రిమ్స్ ఘటనపై సమగ్ర విచారణ

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర
- విద్యుత్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ విభాగాల్లో సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలని హెచ్చరిక
- రిమ్స్‌ను 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామన్న మంత్రి

2



# అణగారిన వర్గాల అభ్యున్నతే సర్కారు లక్ష్యం!

## దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- అట్రాసిటీ బాధితుల పరిహారానికి 'గ్రీన్ ఛానెల్'
- 73 గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీసులకు ఆదేశం
- విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధితోనే సమాజంలో మార్పు
- రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేద్దాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** దళితులు, గిరిజనులు, ఆదివాసీల సర్వాంగీణ అభివృద్ధి, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వి ద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో గుణా త్మక మార్పు వస్తుందని, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరుగుతున్న అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. బుధవారం సచివాలయంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై సీఎం అధ్యక్షతన అత్యున్నత స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమీక్షా స మావేశం నిర్వహించారు. ఉమ్మడి

వివరాలు 2లో..

## విమానాశ్రయాల్లో తెలంగాణ ముద్ర

- ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టుల్లో సంస్కృతి ప్రతిబింబించాలి
- ఢిల్లీ తెలంగాణ భవన్‌కూ ప్రత్యేక శిల్ప, వాస్తు కళ
- కాకతీయ కళాతోరణం, రామప్ప, పిల్లలమర్రి ఆలయాల స్ఫూర్తితో డిజైన్లు
- సీఎం రేవంత్‌రెడ్డి



# జాతీయ వేదికపై తెలుగు సినిమా జయకేతనం

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం వైభవం

- తెలుగు చిత్రాలకు తొమ్మిది పురస్కారాలు
- 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప-2', '35' చిత్రాలకు రెండేసి
- ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'
- మమ్ముట్టి, కార్తిక్ ఆర్యన్‌కు ఉత్తమ నటుల పురస్కారం
- యామీ గౌతమ్‌కు ఉత్తమ నటి.. అనంత్ నాగ్‌కు ఫాల్కే పురస్కారం



వివరాలు సినిమా పేజీలో

# ఎర్రవల్లి సర్వేలో ట్విస్ట్!

- సర్వే నంబర్ 325లో మా భూములు కలిపేశారు
- శివారు వెంకటాపూర్ రైతుల ఆందోళన
- అధికారుల నిర్లక్ష్యంతో 113 ఎకరాలు విలీనం!
- న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి

3



## యూపీఐ చెల్లింపులపై అపోహలొద్దు

- ఎండీఆర్‌పై కేంద్రం స్పష్టత
- చిరు వ్యాపారులపై అదనపు భారం ఉండదని వెల్లడి
- రూ.2 వేల వరకు మర్చంట్ చెల్లింపులకు ఎండీఆర్ సున్నా
- మెజారిటీ డిజిటల్ లావాదేవీలపై ప్రభావం లేదని వివరణ

4





## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ అరెస్ట్

ఇల్లు, ఇతర ప్రాంతాల్లో సుదీర్ఘంగా ఏసీబీ సోదాలు..


రూ. 80 కోట్లకు పైగా అక్రమాస్తుల గుర్తింపు

3

## ఇక సబ్బులు, షాంపూలపై వెజ్.. నాన్ వెజ్ ముద్ర

- కేంద్రం కొత్త నిబంధనలు

4





## మావోయిస్టుల డంప్ లభ్యం

ఛత్తీస్‌గఢ్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

2

## జూరాల వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అడ్డగింత

జడ్చర్ల వద్ద పోలీసుల అదుపులోకి..

ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజం

జూరాల ప్రాజెక్టు పరిధిలో సాగునీరు అందక ఆందోళన బాట పట్టిన రైతులకు సంఘీభావం తెలిపేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని జడ్చర్ల వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

ద3





# మావోయిస్టుల డంప్ లభ్యం

## ఛత్తీస్‌గఢ్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

**భద్రాచలం, సెప్టెంబర్ 22 :** తెలంగాణకు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెద్రే ప్రాంతంలోని లంకా పహాడి గ్రామ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్ బయటపడింది. భద్రతా బలగాలు మంగళవారం తమ గాలింపు చర్యలలో మావోయిస్టులు భారీగా దాచిపెట్టిన ఆయుధాలను గుర్తించాయి. స్వాధీనం చేసుకున్న సామగ్రిలో 01 ఎస్ఎల్ఆర్/ఎల్ఎంజి రైఫిల్, 01 ఇన్సాస్ రైఫిల్, 01.315 బోర్ గన్, 02 బీజీఎల్ లాంచర్లు, 17 బీజీఎల్ సెల్స్, 1 చైనా హ్యాండ్ గ్రెనేడ్, 49 ఎస్ఎల్ఆర్ రౌండ్లు, 15 .315 బోర్ రౌండ్లు, 15 బీజీఎల్ కాట్రిడ్జ్‌లు, 4 ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్లు, 01 .315 బోర్ మ్యాగజైన్‌తోపాటు ఇతర సామగి ఉన్నాయి. అలాగే భైరామ్‌గఢ్ ప్రాంతంలోని అద్వాడ అటవీ ప్రాంతం నుండి ఏకే-47, .315 బోర్ ఆయుధం, సింగిల్-షాట్ గన్, పిస్టల్‌తో పాటు సజీవ తూటాలు, మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫర్సేగఢ్ ప్రాంతంలోని బదేల్‌వాడ అటవీ ప్రాంతం నుండి .315 బోర్ రైఫిల్, 49 సజీవ తూటాలు, 25 సజీవ .303 తూటాలు, 49 సజీవ 12 బోర్ తూటాలు, 8 కేజీల జిలాటిన్, వాకీ-టాకీ, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌డీవోపీ సిద్ధార్థ్ సింగ్ తెలిపారు. మిర్తూర్ ప్రాంతంలోని ఇంద్రిపాల్ అటవీ ప్రాంతం నుండి ఏడు కట్టల విద్యుత్ రహిత తీగలు, డిటోనేటర్లు, గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, భోపాల్‌పట్నం ప్రాంతంలోని నీలమ్‌డగు అటవీ ప్రాంతం నుండి 12 బోర్ నాటు తుపాకీ, బీజీఎల్ లాంఛర్, 8 బీజీఎల్ సెల్స్, 10 సజీవ 12 బోర్ తూటాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

# విమానాశ్రయాల్లో తెలంగాణ ముద్ర

## ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టుల్లో సంస్కృతి ప్రతిబింబించాలి

## ఢిల్లీ తెలంగాణ భవన్‌కూ ప్రత్యేక శిల్ప, వాస్తు కళ

## భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర ప్రణాళిక

## నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించనున్న నూతన తెలంగాణ భవన్ భవనాలు రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ చరిత్ర, కళా వైభవానికి ప్రతిరూపాలుగా భాసించే కాకతీయ కళాతోరణం, రామప్ప దేవాలయం, పిల్లలమర్రి ప్రాచీన ఆలయాల శిల్ప, వాస్తు కళలను అధ్యయనం చేసి, ఆ దివ్య కళాకృతులు ప్రతిబింబించేలా ఈ కీలక నిర్మాణాల డిజైన్లను రూపొందించాలని స్పష్టం చేశారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాల పనులు మరియు ఢిల్లీ తెలంగాణ భవన్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయా నిర్మాణ ప్రాంతాలలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సమస్యలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విమానాశ్రయాల నిర్మాణ స్థలాల్లో ఉన్న విద్యుత్ లైన్ల మార్పిడి, వాగుల ప్రవాహాల మళ్లింపు, రహదారుల పునర్నిర్మాణం, బీఎస్ఎన్ఎల్ లైన్లు మరియు తాగునీటి సరఫరా పైప్‌లైన్ల మార్పుల గురించి సీఎంకు వివరంగా అందించారు. ఈ అంశాలపై స్పందించిన ముఖ్యమంత్రి, ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనులు చేపడితే కాలయాపనతో పాటు అనేక రకాల సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. అందుకే రోడ్లు భవనాలు, విద్యుత్, నీటిపారుదల, తాగునీటి సరఫరా శాఖల అధికారులు బీఎస్ఎన్ఎల్ ప్రతినిధులతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకుని, ఏకకాలంలో పనులు పూర్తయ్యేలా సమగ్ర ప్రణాళికతో ముందడుగు వేయాలని ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని విమానాశ్రయాల నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచించారు. విమానాశ్రయ ప్రాంగణాల కాంపౌండ్ వాల్ సమీపం నుంచి రహదారులను నిర్మించి, వాటిని సమీపంలోని జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులతో సులభంగా అనుసంధానించాలని పేర్కొన్నారు. విమానాశ్రయాల వైపు వచ్చే, వెళ్లే రహదారులు చాలా విశాలంగా ఉండాలన్నారు. అలాగే స్థానికంగా వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సి వస్తే, ఎయిర్‌పోర్ట్ ప్రాంగణం లేదా సమీప ప్రాంతాల్లో కృత్రిమ చెరువులను నిర్మించి, అక్కడ నీటిని నిల్వ చేస్తూ ప్రవాహాల దిశను మార్చాలని ప్రజా ఉపయోగకరమైన సూచనలు చేశారు. సమీక్షా సమావేశంలో ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీ తెలంగాణ భవన్ నిర్మాణాలకు సంబంధించి సిద్ధం చేసిన పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ ఆకృతులలో తెలంగాణ శిల్ప, వాస్తు కళకు పెద్దపీట వేయాలని స్పష్టం చేస్తూ, డిజైన్లలో పలు కీలక మార్పులను అధికారులకు సూచించారు. నిర్దేశిత సమయపరిమితిలోనే పనులన్నీ పూర్తికావాలని ఆదేశించారు.

# బంగాళాఖాతంలో వాయుగుండం

## రాష్ట్రంలో రెండు రోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** బంగాళాఖాతంలో ఏ ర్పడిన వాయు గుండం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైద రాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బు ధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తా రంగా కురుస్తాయని పేర్కొన్న ది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. రా ష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో అతి భారీ వర్షాలు, మరో 20 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి, భూపాల పల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ప్ర స్తుతం బంగా ళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం రానున్న 12 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధి కారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాం తాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతే సర్కారు లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న చివరిసారిగా జరిగిన ఈ రాష్ట్ర స్థాయి సమావేశం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మళ్లీ జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, పలువురు శాసనసభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అట్రాసిటీ చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు వేగం, ప్రత్యేక కోర్టుల పనితీరు, బాధితులకు అందుతున్న పునరావాసంపై సుదీర్ఘంగా చర్చించారు. గడిచిన ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు వెల్లడించగా, ఎక్కువ కేసులు నమోదవుతున్న 73 గ్రామాలపై పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. అత్యాచార



బాధితులకు మానవీయ కోణంలో తక్షణమే న్యాయం అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ముఖ్యమంత్రి చెప్పారు. బాధితులకు నష్టపరిహారం, సహాయ పునరావాస నిధుల విడుదలను బడ్జెట్‌తో ముడిపెట్టకుండా 'గ్రీన్ ఛానెల్' ద్వారా నేరుగా విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల జరిగిన షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడ నర్సు హత్యాచారం కేసులను ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుంబాలకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అణగారిన వర్గాలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను అందించి చూపిన స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్ర జనాభా దామాషా ప్రకారం సంక్షేమ నిధులను కేటాయిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో 16 శాతం ఉన్న ఎస్సీ వర్గాలకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ఏకంగా 31 శాతం, 10 శాతం ఉన్న ఎస్టీలకు 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందించడంతో పాటు, 3.48 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేయడం ద్వారా దళిత, గిరిజన కుటుంబాలకు పోషకాహారం అందుతోందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించినప్పుడే అట్టడుగు వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నొక్కిచెప్పిన ముఖ్యమంత్రి, ఈ వికాస ప్రస్థానంలో భాగస్వామ్యం కావడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు.

# ఆదిలాబాద్ రిమ్స్‌లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం

- ముగ్గురు నవజాత శిశువుల మృతి
- ఎస్ఎన్ సీయూ వార్డులో షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- ఘటనపై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి.. బాధితులకు పరామర్శ
- హెలికాప్టర్‌లో రిమ్స్‌ను సందర్శించి భద్రతా ఆడిట్‌కు ఆదేశించిన మంత్రి దామోదర



**ఆదిలాబాద్, సెప్టెంబరు 22 :** ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ప్రభుత్వ బోధనాసుపత్రిలో సోమవారం అర్ధరాత్రి ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నవజాత శిశు తీవ్ర సంరక్షణ విభాగం (ఎస్ఎన్ సీయూ) వార్డులో రాత్రి 11:40 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి, ఏసీ యూనిట్‌కు మంటలు అంటుకుని పేలిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వార్డు అంతటా దట్టమైన పొగ కమ్మేయడంతో లోపల ఉన్న 27 మంది పసికందుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది, బాధితుల బంధువులు అద్దాలు పగలగొట్టి పసికందులను బయటకు తీసుకువచ్చారు. అయితే, దట్టమైన పొగకు తాళలేక ఇచ్చోడ మండలానికి చెందిన సలీం ఖాన్ ఐదు రోజుల ఆడశిశువు రాత్రికే ప్రాణాలు కోల్పోయింది. మిగిలిన చిన్నారులను వెంటనే ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్‌లలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించగా, మంగళవారం ఉదయం ఉట్నూర్‌కు చెందిన సమ్రిన్ కుమార్తె, ఇంద్రవెల్లికి చెందిన కుమ్ర దినేష్ 15 రోజుల కుమార్తె చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య ముగ్గురికి చేరింది. ప్రస్తుతం చికిత్స పొందుతున్న 24 మంది శిశువులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రిమ్స్ ప్రమాద ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేస్తూ, బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు, అగ్నిప్రమాద వార్త తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ అర్ధరాత్రే ఆసుపత్రికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఘటనపై విచారణ వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు తమ పార్టీ తరఫున తక్షణ సాయంగా రూ. 50 వేలు అందిస్తామని ప్రకటించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగురామన్న బాధితులను పరామర్శించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆదిలాబాద్ చేరుకుని ప్రమాదం జరిగిన ఎస్ఎన్ సీయూ వార్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చాంగ్తూ, డీఎంఈ వాణి, రిమ్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఏసీలోని ప్లాస్టిక్ భాగాలు కాలడం వల్లనే ప్రమాద తీవ్రత పెరిగిందని తెలిపారు. ఘటనపై నిపుణుల కమిటీ చేత సమగ్ర విచారణ జరిపిస్తామని, నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతేకాకుండా రిమ్స్‌లో ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ విభాగాలలో త్రివిధ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణ సేవలను మరింత బలోపేతం చేసేందుకు రిమ్స్ ప్రాంగణంలో త్వరలోనే 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (వీజఎ) భవనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. దీనివల్ల రిమ్స్ మొత్తం సామర్థ్యం 950 పడకలకు పెరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా థలసేమియా, సికిల్ సెల్ అనీమియా బాధితుల కోసం హెమటాలజీ విభాగం, అత్యవసర వైద్య విభాగాన్ని అందుబాటులోకి తెస్తామని, పీడియాట్రిక్స్, గైనకాలజీ విభాగాల్లో పీజీ సీట్లను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బండారి అనూష, ఐటీడీఏ పీవో మంద మకరంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రిమ్స్ ఘటనపై సమగ్ర విచారణ

## వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**ఆదిలాబాద్, సెప్టెంబరు 22 :** ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో (ఎస్ఎన్ సీయూ) సోమవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన ఆయన, ప్రమాదం జరిగిన నవజాత శిశు వార్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, వైద్యులతో అత్యున్నత సమీక్షా సమావేశం నిర్వహించి, ప్రమాద సమయంలో చేపట్టిన సహాయక చర్యలు, శిశువుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి మరియు వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్షానంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, సోమవారం రాత్రి సుమారు 11:40 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి, ప్లాస్టిక్ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించి ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రి సిబ్బంది, జిల్లా యంత్రాంగం, పోలీసు మరియు అగ్నిమాపక శాఖలు సమన్వయంతో స్పందించి పసికందులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయని తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తూ, మిగిలిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, అవసరమైన చోట ప్రైవేట్ ఆస్పత్రుల సహకారాన్ని కూడా తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఆస్పత్రి నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశంపై పూర్తిస్థాయి నిపుణుల కమిటీ చేత సమగ్ర విచారణ జరిపిస్తామని మంత్రి ప్రకటించారు. అలాగే రిమ్స్‌లో ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ విభాగాలలో త్రీ-వే సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆడిట్ నివేదికల ఆధారంగా అవసరమైన మౌలిక వసతులు, పునరుద్ధరణ పనులు, అదనపు సిబ్బంది నియామకంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. విచారణలో అధికారుల లేదా సిబ్బంది నిర్లక్ష్యం తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా రిమ్స్‌లో 150 పడకలతో కూడిన మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 800 పడకలకు ఇది తోడైతే, రిమ్స్ మొత్తం 950 పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా రూపాంతరం చెందుతుందన్నారు. అంతేకాకుండా థలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా బాధితుల కోసం హెమటాలజీ విభాగం, అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక ఎమర్జెన్సీ విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పీడియాట్రిక్స్, గైనకాలజీ, రేడియాలజీ విభాగాల్లో పీజీ సీట్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చాంగ్తూ, డీఎంఏ వాణి, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో మంద మకరంద్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎర్రవల్లి సర్వేలో ట్విస్ట్!

## సర్వే నం.325లో మా భూములు కలిపేశారు'

## శివారు వెంకటాపూర్ రైతుల ఆందోళన

## అధికారుల నిర్లక్ష్యంతో 113 ఎకరాలు విలీనం!

## న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి

**మర్కుక్, సెప్టెంబర్ 22 :** మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో గల 388 ఎకరాల భూమిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ పరిధిలో రెవెన్యూ అధికారులు ఐదవ రోజు సర్వేను ముమ్మరం చేశారు. ఏడీ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ సేవ్య నాయక్ సమక్షంలో, మర్కుక్ ఎమ్మార్వో సరిత పర్యవేక్షణలో సర్వేయర్లు నాలుగు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. ఈ సర్వేలో సంచలన విషయం బయటపడింది. ఫీల్డ్‌లో సర్వే జరుగుతుండగానే శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు అక్కడికి చేరుకుని తమ ఆవేదనను అధికారుల ముందు వెళ్లబోసుకున్నారు. అప్పట్లో ఉన్న అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ గ్రామానికి చెందిన 113 ఎకరాల భూమిని ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో విలీనం చేశారు.. దీంతో తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారు అని ఆవేదన వ్యక్తం చేశారు. పాత నక్షా ప్రకారం తమ భూమి సర్వే నంబర్లు 38,41,47,48,85,86,88,89, 100,101,162 గా ఉండేవని, ఈ సర్వే నంబర్ల భూమిని ఎర్రవల్లి 325లో కలపడం వల్లే 388 ఎకరాలు అయిందని, నిజానికి ఎర్రవల్లికి ఉండాల్సింది 250 ఎకరాలు మాత్రమేనని రైతులు స్పష్టం చేశారు. అంతకు ముందున్న తమ గ్రామ సర్వే నంబర్లు కూడా ఇప్పుడు రికార్డుల్లో లేవని, పాత నక్షాలు, రికార్డులను మార్చి తమకు అన్యాయం చేశారని వారు ఆరోపించారు. తమ వద్ద ఉన్న పాత రికార్డులను, పాత నక్షాను మీడియా ముందు ఆధారాలుగా చూపారు. తాజాగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో తాము కోల్పోయిన సర్వే నంబర్లను తిరిగి తమ గ్రామమైన శివారు వెంకటాపూర్ లో విలీనం చేయాలని, తమకు న్యాయం చేయాలని శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు ప్రభుత్వాన్ని, రెవెన్యూ అధికారులను వేడుకున్నారు.

# లాభాల శిఖరానికి ఏపీహెచ్‌ఎంఈఎల్

- మూడేళ్లలో రూ.34.20 కోట్ల నికర లాభం
- 2025-26లోనే రికార్డుస్థాయిలో రూ.23.33 కోట్ల లాభాలు
- మూసివేత అంచుల నుంచి జాతీయస్థాయి సంస్థ దిశగా..
- సింగరేణి నిర్వహణ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో కొత్త ఉత్సాహం



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** దాదాపు మూడు దశాబ్దాల క్రితం రూ. 21 కోట్లకు పైగా నష్టాలతో మూతపడే స్థితికి చేరిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీహెచ్‌ఎంఈఎల్ - అప్మెల్) సంస్థ, ఇప్పుడు సింగరేణి యాజమాన్య నిర్వహణలో రికార్డు స్థాయి లాభాలతో దూసుకుపోతోంది. సింగరేణి అధీనంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రూ. 60.85 కోట్ల సంచిత లాభాలను ఆర్జించగా, కేవలం గత మూడేళ్ల వ్యవధిలోనే రూ. 34.20 కోట్ల నికర లాభాలను సొంతం చేసుకుంది. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి విస్తరణతోపాటు అప్మెల్‌ను జాతీయ స్థాయి ఇంజినీరింగ్ దిగ్గజంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన చర్యలు సంస్థకు నూతన జవసత్వాలను అందించాయి. దీనికి ఫలితంగా 50 ఏళ్ల కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 23.33 కోట్ల రికార్డు నికర లాభాన్ని సొంతం చేసుకుంది. తీవ్ర నష్టాల కారణంగా 2002లో బీఐఎఫ్ఆర్ మూసివేత ఉత్తర్వుల వరకు వెళ్లిన అప్మెల్, సింగరేణి చొరవతో క్రమంగా కోలుకుంది. 2023-24లో రూ. 1.05 కోట్లు, 2024-25లో రూ. 9.87 కోట్లు, అలాగే 2025-26లో రూ. 23.33 కోట్ల నికర లాభాలను సాధించి వరుసగా మూడేళ్లుగా లాభాల బాటలో పయనిస్తోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో ప్లాంట్ పనితీరు మెరుగుపడింది. గత ఏడాది ప్లాంట్‌ను స్వయంగా సందర్శించిన ఉప ముఖ్యమంత్రి, మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్త యంత్రాల తయారీ, కొత్త మార్కెట్ల అన్వేషణ మరియు వ్యయ నియంత్రణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. 1976లో విజయవాడ సమీపంలోని కొండపల్లి వద్ద 209 ఎకరాల్లో ఏర్పాటైన అప్మెల్‌లో సింగరేణి క్రమంగా రూ. 14.08 కోట్ల పెట్టుబడులు పెట్టి 81.54 శాతం వాటాతో ప్రధాన భాగస్వామిగా మారింది. గతంలో కేవలం సింగరేణి అవసరాలకు మాత్రమే యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేసిన అప్మెల్, ప్రస్తుతం తన సరఫరాలను దేశవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం బీహెచ్ఈఎల్, జెన్‌కో, ఎన్ఎండిసి, ఆర్ఐఎన్ఎల్ వంటి జాతీయ స్థాయి దిగ్గజ సంస్థల నుంచి ఆర్డర్లు సాధిస్తూ వ్యాపారాన్ని విస్తరిస్తోంది. సంస్థలో వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా కొండపల్లి ప్లాంట్ ప్రాంగణంలో రూ. 1.24 కోట్ల అంచనా వ్యయంతో 300 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా రోజుకు 1,200 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుండగా, నెలకు రూ. 2 లక్షల చొప్పున ఏటా సుమారు రూ. 24 లక్షల వరకు విద్యుత్ బిల్లుల ఖర్చు ఆదా కానుంది. విద్యుత్ ఆదాతో పాటు హరిత ఇంధన వినియోగం దిశగా వేసిన ఈ అడుగు తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చిందని ప్లాంట్ అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎంజీఎంలో మళ్లీ పెచ్చుల కలకలం

- ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లో ఊడిపడిన పైకప్పు
- ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం
- ఆస్పత్రి వద్ద భారీగా పోలీసుల మోహరింపు.. మీడియాకు ఆంక్షలు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్‌ను అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- పోలీసులు తనపై దాడి చేశారంటూ వినయభాస్కర్ ఆరోపణ



**వరంగల్, సెప్టెంబర్ 22 :** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మరోసారి పైకప్పు పెచ్చులు ఊడిపడటం కలకలం రేపింది. ఆదివారం ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు భాగాలు ఊడిపడి పలువురు గాయపడిన ఘటన మరువకముందే మంగళవారం ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లో మరోసారి పెచ్చులు కూలిపోయాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వరుస ఘటనలతో ఆస్పత్రి పాత భవనాల భద్రతపై రోగులు, వారి బంధువుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆదివారం జరిగిన ఘటన అనంతరం వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఆస్పత్రిని పరిశీలించారు. పాత భవనాల్లోని కొన్ని విభాగాల పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులతో అంచనా వేయిస్తున్నట్లు వైద్య విద్య సంచాలకురాలు వాణి తెలిపారు. అవసరమైతే పాత భవనాల్లో కొనసాగుతున్న విభాగాలను తరలించే అవకాశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలన జరిగిన మరుసటి రోజే మరోసారి పైకప్పు పెచ్చులు ఊడిపడటం ఆందోళనకు కారణమైంది.

### ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

వరుస ఘటనల నేపథ్యంలో ఎంజీఎం ఆస్పత్రి వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆస్పత్రిలో పరిస్థితులను పరిశీలించేందుకు, బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్‌ను పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. ఆయనతోపాటు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు, పార్టీ శ్రేణులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆస్పత్రి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. మీడియా ప్రతినిధులను కూడా ఆస్పత్రి లోపలికి అనుమతించలేదని వార్తా కథనాలు పేర్కొన్నాయి.

### 'నాపై దాడి చేశారు'

తోపులాటలో తన కాలు, చేతికి గాయాలయ్యాయని వినయభాస్కర్ ఆరోపించారు. పోలీసులు తనను కడుపులో తన్నారని కూడా ఆయన ఆరోపించారు. అనంతరం ఆయనను నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తనను ఎంజీఎంలోనే చికిత్స చేయాలని కోరినప్పటికీ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులపై వినయభాస్కర్ చేసిన దాడి ఆరోపణలు ఆయన వాదనగా వార్తా కథనాల్లో నమోదయ్యాయి.

### 'పేదలకు వైద్యం కరవు'

ఎంజీఎంలో పేదలకు కనీస వైద్య సదుపాయాలు సరిగా అందడం లేదని వినయభాస్కర్ విమర్శించారు. ఆస్పత్రిలో సరిపడా పడకలు లేకపోవడం, పాత భవనాల పైకప్పుల నుంచి పెచ్చులు ఊడిపడటం, ఇతర మౌలిక వసతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీసులతో అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఎంజీఎం పాత భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరినట్లు అధికారులు సైతం గుర్తించారు. ఆస్పత్రి 1960వ దశకంలో నిర్మించిన పాత భవనాల్లో కొనసాగుతుండగా, వాటి పరిస్థితిపై సివిల్, ఇంజినీరింగ్ విభాగాలు అంచనా వేస్తున్నట్లు వైద్య విద్య సంచాలకురాలు వాణి తెలిపారు. కొత్త వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనంలోకి ఎంజీఎంను తరలించే ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# ప్రజా సమస్యలపై 'సిటిజన్స్ వాచ్'

- తెలంగాణ సిటిజన్స్ వాచ్ ఆవిర్భావం
- పౌరసమస్యలు వెలుగులోకి తెచ్చేందుకు స్వతంత్ర పౌర వేదిక
- ప్రజల నుంచి ఫొటోలు, వీడియోలు, పత్రాలు, ఆధారాల స్వీకరణ
- పరిశీలన అనంతరం అధికారుల దృష్టికి సమస్యలు
- ప్రజా జవాబుదారీతనం, బాధ్యతాయుత పౌర రిపోర్టింగే లక్ష్యం: ఇప్ప పృథ్వి

TELANGANA CITIZEN WATCH
telangana.report
When the system fails, citizens need somewhere to be heard.
Report | Document | Escalate | Track

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న పౌర, సామాజిక సమస్యలను బాధ్యతాయుతంగా వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా 'తెలంగాణ సిటిజన్స్ వాచ్' పేరుతో స్వతంత్ర పౌర వేదికను ప్రారంభించినట్లు సంస్థకు నేతృత్వం వహిస్తున్న ఇప్ప పృథ్వి తెలిపారు. ప్రస్తుతం చిన్న బృందంతో ప్రారంభమైన ఈ వేదికను భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించిన సమాచారం, ఫొటోలు, వీడియోలు, పత్రాలు, ఇతర ఆధారాలను స్వీకరించి సాధ్యమైనంత వరకు వాటిని పరిశీలిస్తామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారులు, సంస్థలు, ప్రజాప్రతినిధుల దృష్టికి చట్టబద్ధమైన మార్గాల్లో సమస్యలను తీసుకెళ్లడం వేదిక ప్రధాన లక్ష్యమని వివరించారు.

### ఆధారాల పరిశీలన తర్వాతే..

అందిన సమాచారాన్ని సాధ్యమైన మేరకు పరిశీలించడం, ఇతర ఆధారాలతో సరిచూసుకోవడం, అవసరమైన సందర్భాల్లో సంబంధిత వ్యక్తులు లేదా సంస్థల వివరణ కోరడం వంటి విధానాలను అనుసరిస్తామని పృథ్వి తెలిపారు. కొత్తగా విశ్వసనీయ సమాచారం అందితే గత సమాచారాన్ని సరిచేయడం లేదా నవీకరించడం జరుగుతుందన్నారు. వేదికలో ఏదైనా అంశాన్ని ప్రచురించినంత మాత్రాన సంబంధిత వ్యక్తి లేదా సంస్థ దోషిగా తేలినట్లు భావించరాదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే సమాచారం విషయంలో బాధ్యతాయుత విధానాన్ని అనుసరిస్తామని పేర్కొన్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా పౌర నెట్‌వర్క్

భవిష్యత్తులో గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీలు, నగరాల్లో పౌరులు, కార్యకర్తలు, స్వచ్ఛంద కార్యకర్తలతో కూడిన నెట్‌వర్క్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పౌరులు, కార్యకర్తలు, వలంటీర్లు, జర్నలిస్టులు, పరిశోధకులతోపాటు సాంకేతిక, న్యాయ రంగాల నిపుణులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. తెలంగాణ సిటిజన్స్ వాచ్ ప్రభుత్వ సంస్థ, పోలీసు శాఖ, న్యాయస్థానం లేదా చట్టబద్ధమైన అధికార సంస్థ కాదని పృథ్వి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను బాధ్యతాయుతంగా నమోదు చేసి అవసరమైనప్పుడు వాటిని సరైన అధికారిక మార్గాలకు చేరవేసేందుకు పనిచేసే స్వతంత్ర పౌర వేదిక మాత్రమేనని తెలిపారు. అత్యవసర పరిస్థితులు, తీవ్రమైన నేరాలు లేదా తక్షణ ప్రమాదం ఉన్న సందర్భాల్లో ప్రజలు నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అధికారిక చర్యలకు తెలంగాణ సిటిజన్స్ వాచ్ ప్రత్యామ్నాయం కాదని, ప్రజా అవగాహన, బాధ్యతాయుత పౌర రిపోర్టింగ్, ప్రజా జవాబుదారీతనం కోసం అదనపు వేదికగా పనిచేస్తుందని ఇప్ప పృథ్వి పేర్కొన్నారు.



# జూరాల వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అడ్డగింత

### జడ్చర్ల వద్ద పోలీసుల అదుపులోకి.. ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజం

**జడ్చర్ల/మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 22 :** జూరాల ప్రాజెక్టు పరిధిలో సాగునీరు అందక ఆందోళన బాట పట్టిన రైతులకు సంఘీభావం తెలిపేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును, ఆయన బృందాన్ని జడ్చర్ల వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న తమ పార్టీ అధినేతను, నేతలను పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని బీజేపీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. సమస్యలను పరిష్కరించడం మాని, ప్రతిపక్షాల అరెస్టులు మరియు నిర్బంధాలతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరసనలను అణచివేయాలని చూస్తోందని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పోరాటమైనా, రైతు సమస్యలైనా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తే అరెస్టులే సమాధానంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి, జూరాల పరిధిలో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు అవగాహన కల్పించకుండా విత్తనాలు వేసి పంటలు పెరిగిన తర్వాత సాగునీరు ఇవ్వబోమని చెప్పడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పొరుగున ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నప్పటికీ, నీటి విడుదలలో ప్రభుత్వం రాజకీయం చేస్తోందని ఆరోపించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన 'ఫసల్ బీమా' కంటే మెరుగైన పథకం తెస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, వెయ్యి రోజులు దాటినా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. తక్షణమే ప్రధాని ఫసల్ బీమా యోజన లేదా రాష్ట్రస్థాయి కొత్త బీమా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుబంధు కింద రూ. 15,000 ఎంతమందికి ఇచ్చారో, రూ. 500 బోనస్ ఎంతమందికి అందిందో ప్రభుత్వం లెక్కలు చెప్పాలని రామచందర్‌రావు నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులపై 80 శాతం సబ్సిడీ ఇస్తుంటే, పంపిణీ విఫలమై సరిగ్గా పనిచేయని యాప్‌లను సాకుగా చూపుతూ నిందలను కేంద్రంపై నెట్టేందుకు చూస్తున్నారని తప్పుబట్టారు. మరొకవైపు పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టుల భూనిర్వాసితులకు ఇప్పటివరకు సరైన పరిహారం ఇవ్వలేదని, కొడంగల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ భూసేకరణకు ఏ ప్రాతిపదికన పరిహారం చెల్లించారో.. ఇక్కడి భూ నిర్వాసిత రైతులకు కూడా అదే స్థాయిలో పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులు, భూనిర్వాసితుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

### నిమ్స్ అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ అరెస్ట్

### ఇల్లు, ఇతర ప్రాంతాల్లో సుదీర్ఘంగా ఏసీబీ సోదాలు..

### రూ. 80 కోట్లకు పైగా అక్రమాస్తుల గుర్తింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన వ్యవహారంలో నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. హైదరాబాద్ ఎర్రగడ్డలోని ఆయన నివాసంతో పాటు తెలంగాణ, ఏపీల్లోని మొత్తం 13 చోట్ల ఏసీబీ బృందాలు మంగళవారం ఉదయం నుంచి సుదీర్ఘంగా నిర్వహించిన సోదాల అనంతరం ఈ చర్య తీసుకున్నారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఆయన ఆర్జించిన అక్రమాస్తుల విలువ సుమారు రూ. 80 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సోదాల అనంతరం డాక్టర్ లక్ష్మీభాస్కర్‌కు చెందిన రూ. 6.13 కోట్ల ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ కలిగిన భారీ ఆస్తుల పత్రాలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. వీటిలో కూకట్‌పల్లి నుంచి విశాఖపట్నం వరకు వివిధ నగరాల్లో ఉన్న 10 విలాసవంతమైన ఫ్లాట్లు, శామీర్‌పేట్, యాదాద్రి, నందిగామ ప్రాంతాల్లో 800 చదరపు గజాల ప్లాట్‌తో పాటు మరో నాలుగు ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు వివిధ బ్యాంకుల్లో రూ. 1.41 కోట్ల డిపాజిట్లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో రూ. 35 లక్షల పెట్టుబడులు, రూ. 29.55 లక్షల విలువైన మ్యూచువల్ ఫండ్స్‌ను కనుగొన్నారు. ఒక వివాదాస్పద ఫ్లాట్‌లో రూ. 1.30 కోట్ల పెట్టుబడి పెట్టడంతో పాటు, ఇతరులకు రూ. 1.33 కోట్లు హ్యాండ్ లోన్‌గా ఇచ్చినట్లు ఆధారాలు లభించాయి. అలాగే 517.8 గ్రాముల బంగారం, నాలుగు లగ్జరీ కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను సోదాల్లో జప్తు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల సేకరణతో పాటు నిమ్స్ ఆస్పత్రిలో దాదాపు 90 మంది స్కిల్డ్, అన్‌స్కిల్డ్ సిబ్బంది నియామకాల ప్రక్రియలో డాక్టర్ లక్ష్మీభాస్కర్ అక్రమాలకు పాల్పడి, అభ్యర్థుల నుంచి భారీగా వసూలు చేసినట్లు తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఏసీబీ ఈ కోణంలో కూడా విచారణ జరుపుతోంది. అరెస్టు చేసిన లక్ష్మీభాస్కర్‌కు ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.

## సంపాదకీయం




# ఆస్ట్రేలియా వీసాలకు కొత్త కట్టడి!

**విద్యార్థి వీసాలపై మరింత నియంత్రణ**

**కుటుంబ సభ్యుల రాకపై కొత్త ఆంక్షలు**

**'వీసా హోపింగ్'కు చెక్ పెట్టేలా మార్పులు**

**భారత విద్యార్థులపైనా ప్రభావం పడే అవకాశం**

**నైపుణ్య వలసలకు మాత్రం ప్రాధాన్యం**

ఆస్ట్రేలియా వలస విధానంలో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూర్చే నైపుణ్య వలసలకు మద్దతు కొనసాగిస్తూనే.. విద్యార్థి, గ్రాడ్యుయేట్ వీసాలను ఆస్ట్రేలియాలో ఎక్కువకాలం ఉండేందుకు మార్గంగా ఉపయోగించుకునే పద్ధతులకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ విద్యార్థులు కుటుంబ సభ్యులను వెంట తీసుకురావడంపైనా కొత్త పరిమితులు విధించనున్నట్లు ఆస్ట్రేలియా హోంశాఖ మంత్రి టోనీ బర్క్ వెల్లడించారు. జాతీయ పత్రికా క్లబ్‌లో ఇటీవల ప్రసంగించిన బర్క్.. వలసలను పూర్తిగా తగ్గించడం తమ విధానం కాదని, దేశానికి ఆర్థిక ప్రయోజనం కలిగించే వలసలు అవసరమేనని చెప్పారు. ముఖ్యంగా గృహ నిర్మాణం సహా నైపుణ్య కొరత ఉన్న రంగాలకు విదేశీ కార్మికుల అవసరం ఉందన్నారు. అదే సమయంలో వీసా వ్యవస్థ దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం మరింత నియంత్రణ తీసుకురానున్నట్లు వివరించారు. ఒక వీసా నుంచి మరో వీసాకు మారిన ప్రతి ఒక్కరినీ 'వీసా హోపింగ్' చేస్తున్నట్లు చూడటం సరికాదని బర్క్ స్పష్టం చేశారు. విద్యార్థి వీసాపై వచ్చి నైపుణ్య కొరత ఉన్న రంగంలో చదువు పూర్తి చేసి, గ్రాడ్యుయేట్ వీసాకు మారి, ఉద్యోగం సంపాదించి, యజమాని స్పాన్సర్‌షిప్‌తో తాత్కాలిక నైపుణ్య వీసా పొంది, అనంతరం శాశ్వత నివాసానికి అర్హత సాధించడం చట్టబద్ధమైన వలస మార్గమేనని వివరించారు. అయితే శాశ్వత నివాసానికి అవసరమైన అర్హతలు సాధించే ఉద్దేశం లేకుండా.. ఆస్ట్రేలియాలో ఎక్కువకాలం ఉండేందుకు పదేపదే వీసాలు, కోర్సులు మార్చడం, అప్పీళ్ల ప్రక్రియను ఉపయోగించుకోవడం వంటి పద్ధతులపైనే ప్రభుత్వం దృష్టి పెట్టింది. విద్యార్థులు కోర్సులు మార్చాలనుకుంటే కొత్త విద్యార్థి వీసాకు దరఖాస్తు చేయాల్సిన విధానాన్ని తీసుకురానున్నట్లు వెల్లడైంది. అంతర్జాతీయ విద్యార్థులు, గ్రాడ్యుయేట్ వీసాదారులు కుటుంబ సభ్యులను తమ వీసాలకు జతచేసుకుని ఆస్ట్రేలియాకు తీసుకువచ్చే అవకాశాన్ని సాధారణంగా నిలిపివేయనున్నట్లు బర్క్ ప్రకటించారు. అయితే ఇప్పటికే కుటుంబ సభ్యులతో ఆస్ట్రేలియాలో ఉన్నవారిని విడదీయబోమని స్పష్టం చేశారు. పీహెచ్‌డీ వంటి కొన్ని కోర్సులు, పసిఫిక్, ఆసియాన్ దేశాలకు సంబంధించిన ప్రత్యేక వీసా పరిస్థితులకు మినహాయింపులు ఉంటాయని తెలిపారు. ఈ మార్పు భారతీయ విద్యార్థులకూ వర్తించే అవకాశం ఉన్నందున, ముఖ్యంగా జీవిత భాగస్వామి లేదా ఇతర అర్హ కుటుంబ సభ్యులతో కలిసి చదువుకునేందుకు వెళ్లాలనుకునేవారిపై ప్రత్యక్ష ప్రభావం పడవచ్చు. అయితే అమలు తేదీలు, తుది నిబంధనలు, మినహాయింపుల పూర్తి వివరాలను అధికారిక వీసా మార్గదర్శకాలతో పరిశీలించడం అవసరం. ఆస్ట్రేలియా నిర్మాణ కార్మికుల కంటే యోగా ఉపాధ్యాయులను ఎక్కువగా దేశంలోకి తీసుకుంటోందన్న ప్రచారాన్ని బర్క్ తోసిపుచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 15 వేల మంది నిర్మాణ రంగ కార్మికులు వచ్చారని, యోగా ఉపాధ్యాయుల సంఖ్య 'సున్నా' అని ఆయన పేర్కొన్నారు. భారత్–ఆస్ట్రేలియా ఆర్థిక సహకార, వాణిజ్య ఒప్పందంలో భారతీయ సంప్రదాయ చెఫ్‌లు, యోగా ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రత్యేక నిబంధన మాత్రం ఉంది. అధికారిక ఒప్పందం ప్రకారం చెఫ్‌లు, యోగా ఉపాధ్యాయులు కలిపి గరిష్ఠంగా ఏడాదికి 1,800 మంది అర్హులైన భారతీయులకు తాత్కాలిక ప్రవేశానికి అవకాశం కల్పించే నిబద్ధత ఉంది. అంటే 1,800 మంది యోగా టీచర్లకు ప్రత్యేకంగా వీసాలు ఇవ్వాలనే నిబంధన కాదు. కొత్త విధానం భారతీయ విద్యార్థులను ఆస్ట్రేలియాలో చదవకుండా నిరోధించే సంపూర్ణ నిషేధం కాదు. ప్రధానంగా కుటుంబ సభ్యులను వెంట తీసుకెళ్లే అవకాశం, కోర్సుల మధ్య మార్పులు, ఒకదాని తర్వాత మరో తాత్కాలిక వీసాతో ఆస్ట్రేలియాలోనే కొనసాగేందుకు ప్రయత్నించే మార్గాలపై నియంత్రణ పెరగనుంది. మరోవైపు నిజమైన విద్యార్థిగా చదువు పూర్తి చేసి, నైపుణ్య కొరత ఉన్న రంగంలో ఉద్యోగం సాధించి, చట్టబద్ధమైన వీసా మార్గంలో ముందుకు వెళ్లడాన్ని ప్రభుత్వం ఇప్పటికీ సానుకూలంగానే చూస్తోందని బర్క్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల ఆస్ట్రేలియాలో చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థులకు ఇప్పుడు 'వీసా వస్తుందా?' అన్న ప్రశ్నతోపాటు 'ఎంచుకున్న కోర్సు నిజంగా విద్యా, ఉద్యోగ లక్ష్యాలకు సరిపోతుందా?' అన్నది మరింత కీలకం కానుంది.

# రాజ్యసభలో 12 స్థానాలకు ఎన్నికల నగారా

- అక్టోబర్ 16న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక స్థానానికి ఎన్నికలు
- పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక
- సెప్టెంబర్ 29న నోటిఫికేషన్.. అక్టోబర్ 6 వరకు నామినేషన్లు
- నవంబర్ 25తో పలువురు సభ్యుల పదవీకాలం ముగింపు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 :** రాజ్యసభలో ఖాళీ కానున్న స్థానాలకు ఎన్నికల నగారా మోగింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 11 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలతో పాటు పశ్చిమ బెంగాల్‌లో ఖాళీ అయిన ఒక స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. మొత్తం 12 స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ నిర్వహించనుంది. ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో తొమ్మిది మంది సభ్యులతో పాటు ఉత్తరాఖండ్‌కు చెందిన సభ్యుడి పదవీకాలం నవంబర్ 25తో ముగియనుంది. ఉత్తరప్రదేశ్‌లో మరో స్థానం మాజీ ఉప ముఖ్యమంత్రి దినేశ్ శర్మ రాజీనామాతో ఇప్పటికే ఖాళీ అయింది. అండమాన్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రుక్మిణి మల్లిక్ జులై 16న రాజీనామా చేయడంతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కూడా అదే రోజు ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ స్థానంలో ఎన్నికయ్యే సభ్యుడి పదవీకాలం 2032 ఏప్రిల్ 2 వరకు కొనసాగుతుంది. ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 29న విడుదల చేయనున్నారు. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీ. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా, అభ్యర్థిత్వాల ఉపసంహరణకు అక్టోబర్ 9 వరకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియను అక్టోబర్ 19లోగా పూర్తి చేయనున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటర్లు బ్యాలెట్ పత్రంపై ప్రాధాన్యతలను నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి అందించే ప్రత్యేక వైలెట్ రంగు స్కెచ్ పెన్నును మాత్రమే ఉపయోగించాలి. ఇతర పెన్నులతో ప్రాధాన్యతలను గుర్తించరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పరిశీలకులను నియమించి పర్యవేక్షించనుంది. ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ సభ్యులు హర్దీప్ సింగ్ పూరి, అరుణ్ సింగ్, గీతా షాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బీఎల్ వర్మ, సీమా ద్వివేది, సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీ నేత రామ్‌జీ గౌతమ్‌ల పదవీకాలం నవంబర్ 25తో ముగియనుంది. ఉత్తరాఖండ్ నుంచి బీజేపీ సభ్యుడు నరేశ్ బన్సాల్ పదవీకాలం కూడా అదే రోజుతో ముగుస్తుంది. దినేశ్ శర్మ ప్రాతినిధ్యం వహించిన ఉత్తరప్రదేశ్ స్థానం ఆయన రాజీనామాతో ఇప్పటికే ఖాళీ అయింది.

# ఆ నోటీసులకు కారణమేంటి?

- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- 'లాజికల్ డిస్క్రిపెన్సీ' అంటే ఏంటో చెప్పాలని ఆదేశం
- యాంత్రికంగా నోటీసులు జారీ చేస్తున్నారా?.. ధర్మాసనం ప్రశ్న
- ఢిల్లీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విచారణ
- చట్టబద్ధ ప్రక్రియ లేకుండా ఒక్క ఓటూ తొలగించబోమన్న ఈసీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 :** ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా లక్షల మంది ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. 'లాజికల్ డిస్క్రిపెన్సీ' పేరుతో నోటీసులు ఇవ్వడానికి అసలు ప్రాతిపదిక ఏమిటని నిలదీసింది. ఈ పదానికి అర్థమేంటి? ఏ ప్రమాణాలతో ఓటర్లను ఈ విభాగంలోకి తీసుకొస్తున్నారు? నోటీసులు యాంత్రికంగా జారీ అవుతున్నాయా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టింది. ఢిల్లీలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో నిర్దిష్ట కారణాలను స్పష్టంగా తెలియజేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఏ ప్రాతిపదికన ఒక ఓటరును 'లాజికల్ డిస్క్రిపెన్సీ' విభాగంలోకి తీసుకొస్తున్నారో స్పష్టత లేదన్నారు. ఈ వర్గీకరణకు సంబంధించిన ప్రమాణాలు, నిర్వచనాలు, విధివిధానాలను బహిర్గతం చేయాలని పిటిషనర్లు కోరారు. ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు దక్కిన వారిలో దాదాపు 33.13 లక్షల మందిని 'నో మ్యాపింగ్', 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' కారణాలతో నోటీసుల కోసం గుర్తించినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. వీరిలో 13.79 లక్షల మందిని 'నో మ్యాపింగ్', 19.33 లక్షల మందిని 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' విభాగంలో గుర్తించినట్లు కోర్టు ముందుంచారు. వాదనల సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. పెద్ద సంఖ్యలో నోటీసులు దాదాపు యాంత్రికంగా జారీ అవుతున్నట్లు కనిపిస్తోందని పేర్కొంటూ, ఈ ప్రక్రియలో అదనపు రక్షణ చర్యలు అవసరమేమో పరిశీలించాలని ఎన్నికల సంఘానికి సూచించింది. 'లాజికల్ డిస్క్రిపెన్సీ'గా గుర్తించడానికి ఉపయోగిస్తున్న ప్రాతిపదికపై స్పష్టత అవసరమని తెలిపింది. నోటీసు అందుకున్న ఓటరికి తన వివరాల్లో అసలు సమస్య ఏమిటో అర్థమయ్యేలా కారణం తెలియజేయాల్సిన అవసరాన్ని కోర్టు ప్రస్తావించింది. ఓటర్ల స్పందనను సులభతరం చేసేందుకు వాట్సాప్, ఈమెయిల్ వంటి మార్గాలను కూడా పరిశీలించాలని సూచించింది. ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది.. చట్టంలో నిర్దేశించిన ప్రక్రియను పాటించకుండా ఏ ఒక్కరి పేరునూ ఓటర్ల జాబితా నుంచి తొలగించబోమని కోర్టుకు తెలిపారు. నోటీసుల వెనుక కారణాలను ఓటర్లకు తెలియజేస్తున్నామని, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇదిలా ఉండగా, సుప్రీంకోర్టు విచారణకు ముందే ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నోటీసులు అందుకున్న ఓటర్లకు సంబంధించిన బూత్‌ల వారీ వివరాలను, గుర్తించిన వ్యత్యాసాల కారణాలను ప్రచురించింది. పేర్లు, తల్లిదండ్రుల పేర్లలో తేడాలు, గత ఓటర్ల జాబితాతో అనుసంధానం కాకపోవడం వంటి కారణాలను అందులో పేర్కొంది.

# యూపీఐ చెల్లింపులపై అపోహలొద్దు

- ఎండీఆర్‌పై కేంద్రం స్పష్టత
- చిరు వ్యాపారులపై అదనపు భారం ఉండదని వెల్లడి
- రూ.2 వేల వరకు మర్చంట్ చెల్లింపులకు ఎండీఆర్ సున్నా
- మెజారిటీ డిజిటల్ లావాదేవీలపై ప్రభావం లేదని వివరణ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 :** యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించనున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం మంగళవారం స్పష్టత ఇచ్చింది. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావులేదని, చిరు వ్యాపారులపై అదనపు భారం పడదని వెల్లడించింది. రూ. 2 వేల వరకు జరిగే మర్చంట్ చెల్లింపులకు ఎండీఆర్ పూర్తిగా సున్నా అని పేర్కొంది. యూపీఐ చెల్లింపులు ఖరీదవుతాయన్న వాదనలు తప్పుదారి పట్టించేవని కేంద్రం తెలిపింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మెజారిటీ డిజిటల్ చెల్లింపులకు ఎండీఆర్ వర్తించదని వివరించింది. దీనివల్ల సాధారణ వినియోగదారులు, చిరు వ్యాపారులపై పెద్దగా ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. ఎండీఆర్ వర్తించే సందర్భాల్లో వ్యాపారి చెల్లించిన జీఎస్టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా పొందవచ్చని కేంద్రం వివరించింది. అమ్మకాలపై చెల్లించాల్సిన జీఎస్టీ నుంచి దీనిని సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది. నెలకు లక్ష రూపాయల వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే వ్యాపారులకు ఎండీఆర్ ఉండదని, అందువల్ల ఎండీఆర్‌పై జీఎస్టీ భారం కూడా తలెత్తదని తెలిపింది. యూపీఐ లావాదేవీలపై కొత్తగా భారీ ఛార్జీలు పడతాయన్న ప్రచారంతో వినియోగదారులు, చిరు వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రం స్పష్టం చేసింది.

# ఇక సబ్బులు, షాంపూలపై 'వెజ్.. నాన్ వెజ్' ముద్ర

**కేంద్రం కొత్త నిబంధనలు**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 :** మనం రోజూ వాడే సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్టులు మరియు ఇతర సౌందర్య సాధనాలు శాకాహార మూలాలతో తయారయ్యాయా లేక మాంసాహార పదార్థాలు ఉన్నాయా అన్నది ఇకపై ప్యాకెట్‌ను చూడగానే తెలిసిపోనుంది. ఇప్పటివరకు కేవలం తినుబండారాలు, ఆహార ఉత్పత్తులకే పరిమితమైన 'వెజ్, నాన్-వెజ్' రంగుల ముద్ర విధానాన్ని ఇకపై నిత్య ఉపయోగీ సౌందర్య సాధనాలకూ (కాస్మోటిక్ అండ్ టైలెట్రీస్ ) కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ మేరకు 'లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) ఫోర్త్ అమెండ్‌మెంట్ రూల్స్, 2026' ను కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటిఫై చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, శాకాహార మూలాలు కలిగిన ఉత్పత్తుల ప్యాకేజింగ్‌పై ఆకుపచ్చ (గ్రీన్) రంగు చుక్క గుర్తును ముద్రించాల్సి ఉంటుంది. జంతువుల కొవ్వులు, జెలటిన్ లేదా ఇతర మాంసాహార మూలాల సమ్మేళనంతో తయారైన ఉత్పత్తులపై ఎరుపు (రెడ్) లేదా గోధుమ (బ్రౌన్) రంగు చుక్క గుర్తును తప్పనిసరిగా వేయాలి. వినియోగదారులకు షాపింగ్ చేసే సమయంలో స్పష్టంగా కనిపించేలా ఈ చిహ్నాలను ప్యాకెట్ ముందరి భాగంలో పైభాగంలోనే అమర్చాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇన్నాళ్లూ సబ్బులు లేదా టూత్‌పేస్టులలో వాడిన పదార్థాల వివరాలు తెలుసుకోవాలంటే ప్యాకెట్ వెనుక ఉన్న క్లిష్టమైన కెమికల్ పేర్ల జాబితాను చదవాల్సి వచ్చేది. కొత్త నిబంధన అమలులోకి రావడంతో, వినియోగదారులు తమ వ్యక్తిగత, నమ్మకాలకు అనుగుణంగా ఉత్పత్తులను సులభంగా ఎంచుకునే వెసులుబాటు లభించనుంది.



## పర్యాటక అభివృద్ధికి దూద్ బావి, శివాలయం పరిశీలన

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండలంలోని మొలంగూర్ గ్రామంలో గల దూద్ బావి, శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయాలను ట్రైనీ అధికారి ఐఏఎస్ హరిప్రసాద్, టూరిజం డిపార్ట్‌మెంట్ అధికారి సంతోష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల పర్యాటక అభివృద్ధిపై టూరిజం డిపార్ట్‌మెంట్ అధికారి సంతోష్ తో చర్చించారు. త్వరితగతిన నోట్‌ఫైల్, ఎస్టిమేషన్ సిద్ధం చేసి, పది రోజుల్లోగా నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొలంగూర్ సర్పంచ్ పూదరి రాజు, ఉప సర్పంచ్ దండు రాజేష్, పంచాయతీ సెక్రటరీ గురువయ్య, కారోబార్ దాసరి మొగిలి, మోరే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మోడల్ హౌస్ కు మరమ్మతులు



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటి పారపిట్ గోడ ప్రకృతి వైపరీత్యం కారణంగా కూలిపోయింది. వర్షాల సమయంలో గాలికి చెట్టు విరిగి ఇంటిపై పడటంతో గోడ దెబ్బతిన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్ సహకారంతో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కత్తి రమేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య బుధవారం అక్కడికి చేరుకుని విరిగిన చెట్టును తొలగించారు. దీంతో మరింత ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. పారపిట్ గోడను త్వరలోనే పునర్నిర్మిస్తామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యంతో జరిగిన నష్టాన్ని కూడా విమర్శించడం సరికాదని, విమర్శలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

## గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి




**శెనార్తి మీడియా, బెజ్జంకి:** గణేశ్ నిమజ్జనం సందర్భంగా మండల పరిధిలోని ఉత్సవ కమిటీలు శాంతియుతంగా, సురక్షితంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి సూచించారు. నిమజ్జన ఊరేగింపులో డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని, మద్యం సేవించి పాల్గొనకూడదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పెద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనం కోసం బెజ్జంకి కేంద్రంలో క్రేన్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్ద విగ్రహాల నిర్వాహకులు బెజ్జంకికి వచ్చి క్రేన్ సహాయంతో సురక్షితంగా నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వినాయక మండపాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏకలవ్య యూత్ కార్యవర్గం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** బెజ్జంకి మండల ఏకలవ్య యూత్ సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నెల 20న సంఘం ఏర్పాటైన అనంతరం బుధవారం మండల కేంద్రంలో పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఏకలవ్య యూత్ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి, సభ్యులను ఒగ్గు దామోదర్ సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, టౌన్ ప్రెసిడెంట్ కత్తి రమేష్, దేవస్థాన మాజీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, నాయకులు బోనగిరి శ్రీనివాస్ తదితరులు నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఏకలవ్య యూత్ సంఘం అధ్యక్షుడిగా బండి సంపత్, ఉపాధ్యక్షుడిగా కోనేటి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా కట్ట శ్రీనివాస్‌ను నియమించారు. అలాగే పలువురికి బాధ్యతలు అప్పగించా రు. నూతన కమిటీకి సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులు ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్‌సివిల్‌న్యాయమూర్తి యశ్వంత్సింగ్

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**



రైతులకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని, సంస్థ ద్వారా లభించే ఉచిత న్యాయసేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్‌సివిల్‌జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి యశ్వంత్సింగ్ సూచించారు. కొత్తపల్లి పట్టణంలోని రైతువేదికలో బుధవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు కోర్టు ఖర్చులు భరించలేకపోతే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని, లీగల్ కౌన్సెలింగ్‌ను అందించనున్నట్లు తెలిపారు. సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తక హక్కు, భూసేకరణ చట్టం ద్వారా తగిన నష్టపరిహారం, పునరావాసం పొందే విధానాన్ని వివరించారు. కౌలు రైతులకు సంక్షేమ పథకాలు, కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా తక్కువ వడ్డీ రుణాలు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రక్షణ గురించి అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఫసల్ బీమా యోజన ద్వారా బీమా పరిహారం పొందవచ్చని, నాణ్యత లేని విత్తనాలు, కల్తీ ఎరువులపై వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించవచ్చన్నారు. పంట వ్యర్థాలను కాల్చి వాతావరణ కాలుష్యాన్ని పెంచవద్దని కోరారు. భూ వివాదాలు, బ్యాంకు రుణాల సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్‌లను ఆశ్రయించాలని, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా టెలి–లా, ఎల్ఎస్ఎంఎస్ పోర్టల్ డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఎ.కిరణ్ కుమార్, సీహెచ్.చంద్రప్రకాష్ రెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.మౌనిక, జిల్లా వ్యవసాయాధికారి బి.ఛత్రునాయక్, కొత్తపల్లి ఏవో కె.సంతోష్ కుమార్, చింతకుంట రైతు సంఘం అధ్యక్షుడు శంకరయ్య పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి ఉషు క్రీడల్లో సాన్వి విద్యార్థుల జయకేతనం

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

రాష్ట్రస్థాయి ఉషు క్రీడల్లో సాన్వి విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు కాలేజీ కరస్పాండెంట్ ఎర్రంశెట్టి మునీందర్ తెలిపారు. ఈ నెల19, 20వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి 4వ ఉషు క్రీడాపోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరపున పాల్గొన్న రేకుర్తి సాన్వి కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో పథకాలు సాధించినట్లు పేర్కొన్నారు. యు.మహిమరాణి, రెడ్డి భానుశ్రీ, అయిలి నిశాంత్, చిపిరిశెట్టి వేద వ్యాస్, రుద్రారపు సాయిచరణ్, ఆడెపు ఆత్రేయ బంగారు, దాసరి నందిని, మడప రక్షిత, గుండేటి లక్ష్మీప్రసన్న, పొన్నాల హర్షవర్ధన్, జి.వికాస్బాబు రజత, ఎ.నవదీప్, హర్షవర్ధన్, ఆడెపు ఆత్రేయ, గుడికందుల అనుశ్రీ కాంస్య పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షకులు శ్రీనివాస్, స్వర్ణను ఈ సందర్భంగా అభినందించారు. అక్టోబర్లో చెన్నైలో జరిగే 25వ జాతీయస్థాయి ఉషు పోటీలకు తెలంగాణ తరపున సాన్వి కళాశాల విద్యార్థులు మహిమరాణి, భానుశ్రీ, నిశాంత్, సాయిచరణ్, వేదవ్యాస్, అత్రేయ ఎంపిక అయ్యారన్నారు.

## కొత్తగట్టులో డ్రైనేజీ సమస్య



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** కొత్తగట్టు గ్రామం 10వ వార్డులో డ్రైనే జీ సమస్య తీవ్రంగా మారింది. చిన్నపాటి వర్షానికే వర్షపు నీరు రోడ్లపై నిలిచి, ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు ఇబ్బం దులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని రెండు నెలలుగా గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



## దాచారంలో పోలీస్ కళాబృందం అవగాహన



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** బెజ్జంకి పోలీస్ స్టేషన్ పరిధిలోని దాచారం గ్రామంలో బుధవారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం, మహిళలు, బాలల భద్రత, రోడ్డు భద్రత తదితర అంశాలపై ప్రదర్శనలు, సందేశాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై తిరుపతి మాట్లాడుతూ ప్రజల భద్రత, సామాజిక బాధ్యతపై అవగాహన పెంపొందించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ బైర సంతోష్, ఉప సర్పంచ్ దీటి బాలనర్సు, పోలీస్ కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

## పెన్షన్ లబ్ధిదారుల ఇంటింటి వెరిఫికేషన్



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండలంలోని కల్లేపల్లి గ్రామంలో పెన్షన్ లబ్ధిదారుల ఇంటింటి వెరిఫికేషన్‌ను అధికారి అనిత, సర్పంచ్ బిగుల్ల మోహన్‌తో కలిసి నిర్వహించారు. వితంతు, ఒంటరి మహిళ, వికలాంగ పెన్షన్లు పొందుతున్న లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి ఆధార్, వేలిముద్ర, బ్యాంకు ఖాతా వివరాలను పరిశీలించారు. ప్రతి లబ్ధిదారుడు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నిజమైన అర్హులకు మాత్రమే పెన్షన్ అందేలా ప్రభుత్వం ఈ వెరిఫికేషన్ చేపడుతోందని అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాకేష్, ర్యాకం రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ చారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** గణపతి నవరాత్రులు, వినాయక చవితిని పురస్కరించుకుని ఆముదాలపల్లి గ్రామానికి చెందిన గజముక ఫ్రెండ్స్ యూత్ సభ్యులు బుధవారం జమ్మికుంట మారుతినగర్‌లోని శ్రీ సత్యసాయి సదన్–సాయి మానసిక దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక పాఠశాలలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. విద్యార్థులకు భోజనంతో పాటు పండ్లు, స్వీట్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు సూత్రపు బుచ్చిరాములు, స్పెషల్ టీచర్లు బుర్కపల్లి కోమలత, సూత్రపు శాంత, మానస, క్యాతం హైమావతి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 20న స్పందన అనాథ ఆశ్రమంలోనూ అన్నదానం చేసి బ్రెడ్, బిస్కెట్లు, పెన్నులు, స్వీట్లు అందించినట్లు తెలిపారు



## వ్యవసాయ కళాశాలలో కృతికకు సీటు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని చౌడమల్ల కృతిక ప్రతిష్ఠాత్మకమైన PJTSAUలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో సీటు సాధించింది. ఈ నెల 19న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రికల్చర్ కళాశాలలో అడ్మిషన్ పొందింది. చౌడమల్ల సంపత్, రజిత దంపతుల కుమార్తె కృతికను పాఠశాల ప్రిన్సిపాల్ కె. ప్రభాకర్ శాలువాతో సత్కరించి అభినందించారు. కృతిక పట్టుదల, కృషితో ఉన్నత విద్యలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఆమెను ఉపాధ్యాయులు బి. రాజు, సతీష్, శివశంకర్, వనజ అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## 'లంచం అడిగితే సమాచారం ఇవ్వండి'

- గంగాధర మండలం ఒద్యారంలో విచారణ

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

లంచం అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ విజిలెన్స్ అధికారి, రిటైర్డ్ ఎస్పీ డి.నాగరాజు సూచించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఒద్యారంలో గృహనిర్మాణ పథకం లబ్ధిదారుడు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో బుధవారం విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి లబ్ధిదారులను నేరుగా కలుసుకుని వివరాలు సేకరించారు. గృహనిర్మాణ పథకం కింద అందుతున్న ప్రయోజనాలు, చెల్లింపుల ప్రక్రియపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. చెల్లింపులు పొందేందుకు ఎవరైనా లంచం డిమాండ్ చేశారా..? డబ్బులు ఇవ్వాలని ఎవరైనా ఒత్తిడి చేశారా? అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పారదర్శకతతో అమలుకావాలని, లబ్ధిదారులు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని తెలిపారు. గృహ నిర్మాణ పథకం కింద చెల్లింపులు పొందే ప్రక్రియ గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. లంచం డిమాండ్ లేదా అవినీతికి సంబంధించిన సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5991కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈఈ ఎస్.వెంకటరమణ, ఏఈ ఆర్.యశ్వంత్, పంచాయతీ సెక్రటరీ శ్యామల తదితరులు ఉన్నారు.

## అమ్మ పేరిట ఒక మొక్క



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** 'మాకే నామ్ ఎక్ పేడ్' కార్యక్రమంలో భాగంగా దాచారం సర్పంచ్ బైరా మానస రాజేందర్ ఆధ్వర్యంలో అమ్మ పేరిట మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాచారం ప్రభుత్వ పాఠశాల నుంచి దాచారం స్టేజ్ మీదుగా బెజ్జంకి వెళ్లే ప్రధాన రహదారి వరకు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీటి బాలనర్సు, వార్డు సభ్యులు, హెచ్‌ఎం నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉపాధి హామీ మేటీలు రమ, చెందయ్య, సతీష్, లింగం, రాజయ్య, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం నిర్వహించాలి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనం నిర్వహించాలని కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా, అధిక శబ్దానికి దూరంగా నిమజ్జనం చేపట్టాలన్నారు. వెలుతురు ఉన్న సమయంలోనే నిమజ్జనం పూర్తి చేయాలని, నీటి వద్ద ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు, యువత నీటిలో ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మండప నిర్వాహకులు క్రమశిక్షణతో నిమజ్జనం పూర్తి చేసి అందరూ క్షేమంగా ఇళ్లకు చేరేలా చూడాలని కోరారు. "భక్తితో జరుపు కుందాం.. జాగ్రత్తగా నిమజ్జనం చేద్దాం.. క్షేమంగా ఇంటికి చేరుకుందాం" అని ఎస్ఐ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు



## మొక్కలు నాటిన గ్రామస్తులు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండలంలోని గద్దపాక గ్రామంలో స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ కొయ్యడ పరుశరాములు యాదవ్, ఉపసర్పంచ్ జంగా జైపాల్ యాదవ్, వార్డు సభ్యులు పలకల శంకర్ రెడ్డి, ఐరేని ప్రణయ్, బాకారపు వేణు, పున్నం ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ కరుణ, అలివేలు, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు నాటక రంగంలో "స్థానం" వారిది


# ప్రత్యేక స్థానం

### నేడు స్థానం నరసింహారావు జయంతి

స్థానం నరసింహారావుది ఆంధ్ర నాటకరంగ చరిత్రలో నరసింహారావుది ప్రత్యేక స్థానం. నాటక రంగం మనగలిగినంత కాలం ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. ఆయన స్త్రీ పాత్రధారణలో అసాధారణ ప్రజ్ఞ కనబరచి నాటక రంగానికే వన్నె తెచ్చారు. పురుషులే స్త్రీ వేషాలు వేసే ఆ నాటి రోజుల్లో రంగస్థలంపై విభిన్నమైన, పరస్పర విరుద్ధ మయిన పాత్రలను ధరించి, ధరించిన ప్రతి పాత్రలోను తమదైన ప్రత్యేకతను చూపించి లీనమై, ముప్ఫయి సంవత్సరాల పాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ప్రతిభ ఆయనకే సొంతం. నటకా వతంస, నటశేఖర, నాటక కళా ప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదులు, పురస్కారాలు ఆయనను వరించాయి. స్థానం నరసింహారావు (సెప్టెంబర్ 23, 1902 – ఫిబ్రవరి 21, 1971) ప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటులు. సత్యభామ, చిత్రాంగి మొదలైన అనేక స్త్రీ పాత్రలను సుమారు 40 సంవత్సరాలకు పైగా ధరించి 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకాభిమానంతో సహా పద్మశ్రీ పురస్కారం పొందాడు. స్థానం నరసింహారావు 1902, సెప్టెంబర్ 23 న హనుమంతరావు, ఆదెమ్మ దంపతులకు గుంటూరు జిల్లా బాపట్ల లో జన్మించారు. ఆయన చిన్నతనంలో కూచిపూడి భాగవతులు వచ్చి బాపట్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో వెంపటి వెంకటనారాయణ అనే ఆయన భామ వేషం అద్భుతంగా కట్టేవారట. ఆ స్త్రీ వేషం తన మనసులో ఎంతో ఆదరంతో మనసులో నిలిచి పోయి ఉండేదని చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఆయన రంగస్థల ప్రవేశం చేయడానికి దోహదం చేశాయి. 1921లో బాపట్ల లోనే జంట కవులైన తిరుపతి వేంకటకవులకు, కొప్పరపు కవులకు శతావధానం పోటీ జరిగింది. నెగ్గిన తిరుపతి వేంకటకవులని సత్కరించాలని భావించారు. ఆ సందర్భంగా ప్లీడరు గుమాస్తాల బృందం చేత సత్య హరిశ్చంద్ర నాటకం వేయించాలని నిర్ణయించారు. ఆహ్వానాలు వెళ్లిపోయాయి. కానీ చంద్రమతి వేషధారి అస్వస్థుడై రాలేక పోతున్నట్టు చివరి నిమిషంలో తెలిసింది. ప్రత్యామ్నాయం ఏదీ సాధ్యం కాలేదు. చంద్రమతి పాత్రధారి మరొకరు దొరకలేదు. మరో నాటకం వేద్దామంటే పాత్రధారులంతా లేరు. గుండెల్లో రాయి పడింది. అప్పుడే ఆపద్బాంధవుడిలా స్థానం దొరికాడు చోరగుడి హనుమంతరావుకు. వారి నాటకం రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు వెళ్లి కూర్చోవడంతో పద్యాలన్నీ వచ్చేశాయి. ఒకసారి ఎవరూ లేనప్పుడు పాడుకుంటూ ఉంటే హనుమంతరావు విన్నాడు. ఆ ధైర్యంతోనే చంద్రమతి వేషం వేయించాడు. స్థానం వారికి చిన్నతనం లోనే చిత్రలేఖనం కూడా అబ్బింది. ఆ కళతోనే, వేరే ఒకరి ఇంట రహస్యంగా తన వేషం తనే వేసుకున్నారాయన. చిన్న చిన్న లోపాలు ఉన్నా అరంగేట్రంలోనే తిరుపతి కవుల ఆశీస్సులు అందుకున్నారు స్థానం. తెనాలిలోని శ్రీరామ విలాస సభలో ప్రవేశించి ఆకాలంలోని గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతటా పర్యటించి అపారమైన అనుభవం సంపాదించారు. వరంగల్‌లో 'కృష్ణలీల' నాటకంలో యశోద వేషం వేసినందుకు ఆయన జీవితంలో తొలి బంగారు పతకం వచ్చింది. అనతికాలంలోనే ఆయన పేరు మారుమోగి పోయింది. కాపురం బాపట్ల నుంచి తెనాలికి మారింది. శ్రీరామవిలాస సభ అనే నాటక సమాజాన్ని స్థాపించి నటననే జీవికగా చేసుకున్నారు. రోషనార (రోషనార నాటకం), తామీనా (రుస్తుం సొహరాబ్ నాటకంలో), సంయుక్త (రాణీ సంయుక్త), శకుంతల (అభిజ్ఞాన శాకుంతలం), సత్యభామ (శ్రీకృష్ణ తులాభారం), చిత్రాంగి (సారంగధర), దేవదేవి (విప్ర నారాయణ), కోకిల (కోకిల నాటకం), మల్లమ్మ (బొబ్బిలి), మధుర వాణి (కన్యాశుల్కం), అనసూయ (అనసూయ నాటకం), మురాదేవి (చంద్రగుప్త), చింతామణి (చింతామణి), సుభద్ర (వీరాభిమన్య), సరళ (ఛత్రపతి శివాజీ), విద్యాధరి (కాళిదాసు), చండిక (చండిక నాటకం) వంటి పాత్రలు వేశాడు. ఆంధ్రదేశంలో దాదాపు 3,000 సార్లు రంగస్థలం మీద పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శృంగార రసాన్ని ప్రతిబింబించే రీతిలో సత్యభామ పాత్ర, ప్రణయానికి చిత్రాంగిగా, వీరరసాన్ని చిత్రించడంలో రోషనార నాటకంలో రోషనారగా, వలపుల చింతామణిగా, ప్రణయ దేవతగా, భక్తురాలిగా, దేవదేవిగా, మధురాతి మధురమైన మధురవాణిగా నవరసాలు కలిగిన పాత్రలను ప్రతిభా వంతంగా పోషించాడు. వేషధారణ, వస్త్రాలంకరణలో స్థానం వారిది ఒక ప్రత్యేకత. రకరకాల చీరకట్టు సొగసులతో మనోహరంగా రంగస్థానం మీదకు ప్రవేశించి ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశాడు. వీరు సినీ రంగంలో రాధాకృష్ణ (1939), సత్యభామ భామ వంటి కొన్ని సినిమాలలో నటించారు. తన నటనానుభవాలను చేర్చి "నటస్థానం" అనే గ్రంథాన్ని ఆయన రచించాడు. స్థానం నరసింహారావు 1971 ఫిబ్రవరి 21 తేదీన మరణించాడు. 1956లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ఈ బహుమతిని పొందిన తొలి ఆంధ్రుడు, కళాకారుడు. ఆయన రంగ స్థలం పై చూపించిన సమయస్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠం కూడా పెట్టింది. అయన నటనకు ముగ్ధులైన రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వైవిధ్య భరితం... వామనావతారం



"సంభవామి యుగే యుగే"... ధర్మ సంస్థాపనకోసం అవసరమైన సందర్భాల్లో అవతరిస్తూనే ఉంటా'నని శ్రీమహావిష్ణువు అభయ ప్రదానం చేశాడు. ఆ పరంపరలో ఆవిష్కారమైనది...వామనుడు లేదా త్రివిక్రముడు, హిందూ పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాలలో ఐదవ అవతారం. భాద్రపద శుద్ధ ద్వాదశి నాడు అదితి, కశ్యపుల కుమారుడిగా శ్రీహరి వామన మూర్తిగా అవతరించాడు. దీన్ని వామన ద్వాదశిగా, విజయ ద్వాదశిగా వ్యవహరిస్తారు. సృష్టిలోని జీవావరణంలో జీవులు సూక్ష్మ రూపం నుంచి మహా భారీకాయం వరకు వైవిధ్య భరితంగా గోచరమవుతాయి. ఈ అణుత్వం, మహారూపాలు పరస్పర విరుద్ధమైనవి. కానీ, ఆ వైవిధ్యం ఆత్మ, పరమాత్మల విషయంలో లేదని వేదోక్తి. ఆత్మ అణువు కంటే సూక్ష్మమైనది, మహత్తరమైనది. అది ఎంత సూక్ష్మమైనదో, అంత స్థూల మైనదని కఠోపనిషత్తు ప్రకటించింది. వామనావతార నేపథ్యం ఇదే! దేవాసుర యుద్ధంలో ఇంద్రునితో ఓడి పోయిన బలి, రాక్షస గురువైన శుక్రాచార్యుల దయ వలన బ్రతికి, గురూపదేశంతో విశ్వజిత్‌యాగం చేసి బంగారు రథము, మహా శక్తివంతమైన ధనుస్సు, అక్షయ తూణీరములు, కవచము, శంఖములు పొందుతాడు. బలగర్వితుడై ఇంద్రుని మదమణి చేందుకు, రాక్షసుల నందరినీ ఒకచోటచేర్చి, యుద్ధమునకు సంసిద్ధం చేసి అమరావతిపై దండెత్తుతాడు. ఆ దుర్భర దానవ శంఖా విర్భూత ధ్వనులు నిండి, విభుదేంద్ర వధూగర్భములు పగిలి, లోపలి శిశువులు ఆవురని ఆక్రోశించుచుండ, దేవతలు బృహస్పతి వచనములు విని అమరావతి వీడి పారిపోయారు. దేవతల దుస్థితిని చూసి, సుర మాత అదితి, తన భర్తయైన కశ్యప బ్రహ్మను వేడుకున్నది. అంతట కశ్యపుడు అదితికి పయోభక్షణ వ్రతాన్ని ఉ పదేశిస్తాడు. ఆమె ఫాల్గుణ మాసం, శుక్లపక్ష పాడ్యమి నుంచి 12 రోజులు హరి సమర్పణంగా వ్రతం చేసి భర్తను చేరగా, భగవ దంశతో, శ్రవణ ద్వాదశి (శ్రవణ నక్షత్రంతో కూడిన భాద్రపద బహుళ ద్వాదశిని శ్రవణ ద్వాదశి అంటారు), ఆనాడు శ్రోణ అభిజిత్ సంజ్ఞాత లగ్నంలో, రవి మధ్యాహ్నామున చరించు నప్పుడు, గ్రహ తారా చంద్ర భద్రస్థితిలో వామనుడు జన్మించాడు. వామనుడు పుట్టినప్పుడు శంఖ, చక్ర, గదా కమల కలిత, చతుర్భుజునిగా, బిశంగ వర్ణ వస్త్రాలతో, మకర కుండల మండిత గండ భాగుడై, శ్రీ విరాజిత లోలంబ, కదంబ వనమాలిగా సమస్త అలంకారాలతో, నిఖిల జన మనోహరుడిగా అవతరించాడు. రూపాంతరంబున తన దివ్య రూపాన్ని ఉపసంహరించుకొని, కపట వటుని వలె, ఉపనయ వయస్కుండై వామన బాలకుడయ్యాడు. బృహస్పతి యజ్ఞోపవీతాన్ని ఇచ్చాడు. కశ్యప మహర్షి మొలత్రాడు ప్రసాదించాడు .తల్లి అదితి కౌపీనాన్ని , భూమాత నల్లజింక చర్మాన్నీ , చంద్రుడు దండాన్నీ , గగనాధిష్ట దేవత ఛత్రాన్నీ , బ్రహ్మ కమండలువునూ , సరస్వతి అక్షమాలికనూ (జపం చేసే సమయాన జప సంఖ్యను లెక్కపెట్టుకోవడానికి ), సప్తర్షులు పవిత్రలను ( కుశలను /దర్భలు ) వామన మూర్తికి బహూకరించారు . స్వయంగా సూర్య భగవానుడే గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించాడు. వామనుని చూసి జనులు గుజగుజలు పోవుచూ, గజిబిజి పడుచూ, కలకలములై ఎవరీ పొట్టి బాలుడు? శివుడా? హరియా? బ్రహ్మయా? సూర్యుడా? అగ్నియా? ఈ బ్రహ్మచారి ఎవరు? అని విస్మయం చెందారు. కొందరితో చర్చించుచూ కొందరితో జటలు చెప్పుచూ, గోష్ఠిలో పాల్గొనుచూ, తర్కించుచు, ముచ్చటలాడుచు, నవ్వుచూ అనేక విధంబుల అందరికీ అన్ని రూపులై వినోదించుచూ, వెడవెడ నడకలు నడుచుచూ, బుడి బుడి నొడువులు నొడుచుచు, జిడిముడి తడబడగ, వడుగు రాజును సమీపించి "స్వస్తి ! జాగత్త్రయీా భావన శాసన కర్తకు! హాసమాత్ర విధ్వస్త నిలింప భర్తకు, ఉదారపద వ్యవహర్తకు, మునీంద్ర స్తుత మంగళాధ్వ విధాన విహర్తకు, దానవ లోక భర్తకు స్వస్తి అని దీవించెను. బలి అతనికి సముచితాదరమిచ్చి గౌరవించి...వడుగా ! ఎవ్వరి వాడవు? నీకేమి కావలయును కోరుకొమ్మన్నాడు. "ఒంటి వాడను నేను. నాకు ఒకటి, రెండడుగుల మేర యిమ్ము . అయినను అడుగ మంటివి కనుక అడిగితిని. దాత పెంపు సొంపు తలపవలెను గదా! కావున నాకు మూడడుగుల నేలనిమ్ము, చాలు అని మాయా వడుగు పలికెను. ఆ వామనుడిని విష్ణువుగా గుర్తించిన శుక్రుడు బలి చక్రవర్తిని వారించెను. బలి గురువుకు వినయముగా నమస్కరించి ...ఇచ్చెదనని పలికితిని. ఆడిన మాట తప్పను అన్నాడు. అప్పుడు శుక్రాచార్యుడు నీవిచ్చినచో అఖిలంబు పోవును. "ఇంతింతై...వటుడింతయై... అలా ధారా పరిగ్రహంబు చేసి, ఇంతితై వటుడింతయై, దానింతై, నభో వీధిపైనంతై, తోయద మండలాగ్రమున కల్లంతై, ప్రభారాశి పైనంతై, చంద్రునికంతయై, ధ్రువునిపైనంతై, మహర్వాటి పైనంతై, బ్రహ్మాండాంత సంవర్థియై", సత్యపదోన్నతుడైన విష్ణువునకు అప్పుడే ఉదయించిన సూర్యబింబము మొదట గొడుగులా, తదుపరి శిరోరత్నమై, చెవి కుండలమై, మెడలోని ఆభరణమై, బంగారు కేయూరమై, కంకణమై వడ్డాణపు ఘంటమై, నూపుర ప్రవరమై, చివరకు పాదపీఠమై ఒప్ప అతడు బ్రహ్మాండము నిండినాడు – అని బమ్మెర పోతన భాగవతంలో పద్య రచన అద్భుతంగా చేశాడు. వారి జాక్షులందు, వైవాహికము లందు ప్రాణ విత్త మాన భంగమందు.. జకిత గోకులాగ్ర జన్మరక్షణ యందు.. బొంక వచ్చు.....తప్పు లేదు. అది పాపము కాదు. అని శుక్రాచార్యుడు వివరించెను. దానికి బలి చక్రవర్తి ..కారే రాజులు రాజ్యముల్ కలుగవే, గర్వోన్నతిం బొందరే వారేరీ? సిరి మూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనంగలదే! శిబి లాంటి దాతల పేరు ఈనాటికీ స్థిరములైనవి కదా! భార్గవా! అని పలుకుతూ తన మాటను తోసి పుచ్చిన రాజును పదభ్రష్టునివి గమ్మని శుక్రాచార్యుడు శపించాడు. అయినను బలిచక్రవర్తి హరి చరణములు కడిగి, "త్రిపాద ధరిణిం దాస్యామి" అనుచు నీటిధార విడిచాడు. ఆ కలశములో సూక్ష్మకీటక రూపమున చేరి శుక్రాచార్యుడు నీటిధారను ఆప బోయాడు. అప్పుడు హరి కుశాగ్రముతో కలశ రంధ్రమును బొడువగా కన్ను పోగొట్టుకొని శుక్రాచార్యుడు ఏక నేత్రుడయ్యెను. "పుట్టి నేర్చుకునెనో, పుట్టక నేర్చెనో.. ఈ పొట్టి వడుగునకీ చిట్టి బుద్ధులెట్లబ్బెనో, ఈతని పొట్టనిండా అన్నీ భూములే.. అని నవ్వుతూ మూడడుగుల నేలను బలి వడుగుకు దానమిచ్చెను. ఒక పాదంబులో భూమిని కప్పి, దేవ లోకమును రెండవ పాదమున నిరోధించి, జగములెల్ల దాటి చనిన త్రివిక్రముడు మరల వామనుడై బలి నవలోకించి నా మూడవ పాదమునకు స్థలము జూపమన్నాడు. అప్పుడు బలి వినయముతో నీ తృతీయ పాదమును నా శిరమున ఉంచమని వేడుకొనగా సమ్మతించిన హరి బలిని ఆశీర్వదించి, ప్రహ్లాదునితో సుతల లోకమునకు పంపి, తానే ఆలోకమునకు ద్వారపాలకు డాయెను. బలి నడిగి సంపాదించిన లోకములను తన సోదరుడైన ఇంద్రున కిచ్చి సంతోషపరిచాడు శ్రీహరి. "ఛలయసి విక్రమణే బలి మద్భుత వామన పదనఖ నీరజ నతజన పావన కేశవ ధృత వామన రూప జయ జగదీశహరే" – జయదేవుని దశావతార స్తోత్రము ఈ వామనా వతార గాథను విన్న వారు, చదివిన వారు సకల శుభాలను పొందుతారు. దైవారాధన సమయంలో ఎవరైతే త్రివిక్రమ పరాక్రమాన్ని స్మరించు కుంటారో వారికి నిత్య సౌఖ్యాలు కలుగు.తాయని ప్రతీతి. వామన కంచిలో అద్భుతమైన వామన అవతారం గుడి ఉంది. మిత్రానంద పురము వామన మూర్తి దేవాలయం, చెరుపు, త్రిస్సూర్, కేరళ థ్రికక్కర (థ్రికక్కర ఆలయం), కొచ్చిన్, కేరళ కాంచీపురం సమీపంలోని కామాక్షి ఆలయం, ఖజురహో, మధ్యప్రదేశ్, ఉలగ లంథ పెరుమాళ్ దేవాలయం తిరుకొయిలూర్, విల్లుపురము జిల్లా, తమిళనాడు లలో ఆలయాలు ఉన్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రహ్లాద యూత్ విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న మేయర్ కొలగాని



నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్ నంబర్ 4లో ప్రహ్లాద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపాన్ని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు, కాలనీ పెద్దలు మేయర్‌కు స్వాగతం పలికారు. అనంతరం విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజల అనంతరం మండపం నిర్వాహకులు మేయర్‌ను సన్మానించారు.

శెనార్తి మీడియా, కరీంనగర్:





# ఆసియా క్రీడల్లో మహిళల జట్టుకు స్వర్ణ పతకం



**నిషిన్ (జపాన్) సెప్టెంబరు 22 :** ఆసియా క్రీడలు 2026 మహిళల క్రికెట్ పోటీలలో భారత జట్టు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన శ్రీలంక జట్టుపై 147 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. రికార్డు స్థాయి స్కోరు మరియు బ్యాటింగ్ ధనాధన్టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆసియా క్రీడల మహిళల క్రికెట్ చరిత్రలోనే ఇది అత్యధిక స్కోరుగా నమోదైంది. భారత ఓపెనర్లు స్మృతి మంధాన (45 బంతుల్లో 79), షఫాలీ వర్మ (48) తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి బలమైన పునాది వేశారు. ఈ ఇన్నింగ్స్ క్రమంలో స్మృతి మంధాన అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో 11,000 పరుగుల మైలురాయిని చేరుకోగా, ముగింపులో రిచా ఘోష్ (22 బంతుల్లో 49 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో జట్టుకు తిరుగులేని స్కోరు అందించింది. కుప్పకూలిన శ్రీలంక బ్యాటింగ్217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు భారత బౌలర్ల ధాటికి తాళలేకపోయింది. కేవలం 15.4 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో టీమిండియా ఆసియా క్రీడల్లో పసిడి పతకాన్ని ముద్దాడి మరోసారి తన ఆధిక్యాన్ని చాటుకుంది.




# అంతర్జాతీయ క్రికెట్‌లో స్మృతి మంధాన రికార్డు

**నిషిన్ (జపాన్) సెప్టెంబరు 22 :** భారత మహిళా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో మరో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఆసియా క్రీడలు 2026లో భాగంగా శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులో 79 పరుగులతో రాణించిన ఆమె, అంతర్జాతీయ క్రికెట్‌లో 11,000 పరుగుల మైలురాయిని వేగంగా పూర్తి చేసుకున్న తొలి మహిళా క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు నమోదు చేసింది.

ఈ మ్యాచ్‌కు ముందు 10,987 పరుగులతో ఉన్న స్మృతి (టెస్టుల్లో 788, వన్డేల్లో 5,411, టీ20ల్లో 4,788), ఇన్నింగ్స్ ఆరంభంలోనే మూడో ఓవర్లో సిక్సర్ బాదడం ద్వారా ఈ ఘనతను సాధించింది. మహిళల క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలోనూ అత్యంత విజయవంతమైన బ్యాటర్‌గా కొనసాగుతున్న మంధాన, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా ఇప్పటికే తన పేరుపై పలు రికార్డులను కలిగి ఉంది. ఆమె సాధించిన అర్ధశతకం తోడ్పాటుతో భారత్ 147 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను ఓడించి ఆసియా క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా వరుసగా రెండోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

# జపాన్ చేతిలో భారత్‌కు త్రుటిలో షాక్



**సానో (జపాన్) సెప్టెంబరు 22 (శ్రీ తొలిక్రాంతి):** ఆసియా క్రీడల నేపథ్యంలో సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జపాన్‌తో జరిగిన చారిత్రాత్మక టీ20 మ్యాచ్‌లో భారత పురుషుల క్రికెట్ జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో విజయాన్ని అందుకుంది. పసికూన జపాన్ అద్భుత పోరాట పటిమ కనబరచడంతో ఆఖరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో టీమిండియాకు అనూహ్య పరాభవం త్రుటిలో తప్పింది. ఈ విజయంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో (సూపర్ ఓవర్లతో కలిపి) 200వ విజయాన్ని నమోదు చేసిన తొలి జట్టుగా భారత పురుషుల జట్టు కొత్త రికార్డు సృష్టించింది.వర్షం కారణంగా చెరో 5 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌ను జపాన్ బౌలర్లు తీవ్రంగా కట్టడి చేసి 32 పరుగులకే పరిమితం చేశారు. ముఖ్యంగా జపాన్ కుర్రాడు చార్లీ హింజే 2 వికెట్లు తీసి రాణించాడు. అనంతరం 33 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ జట్టు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ వంటి ప్రపంచస్థాయి స్పిన్నర్లను ఎదుర్కొంటూ 30 పరుగులు సాధించి ఓటమి అంచుల వరకు వచ్చింది. మ్యాచ్ అనంతరం జపాన్ కెప్టెన్ కెండెల్ కడోవాకి-ఫ్లెమింగ్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టును చివరి బంతి వరకు నిలువరించడం తమకు గర్వకారణమని, భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తమ పురోగతిని ప్రశంసించడం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నాడు.

# ఓటమి నుంచి టీమిండియాను కాపాడిన ఆల్ రౌండర్ అక్షర్

**సానో (జపాన్), సెప్టెంబరు 22 :** ఆసియా క్రీడలకు సన్నాహకంగా జపాన్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరిగిన చారిత్రాత్మక టీ20 మ్యాచ్‌లో భారత పురుషుల క్రికెట్ జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో విజయాన్ని సాధించింది. వర్షం కారణంగా చెరో 5 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు మాత్రమే చేయగలిగింది. అభిషేక్ శర్మ పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరగగా, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ విఫలమయ్యారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సాధించిన 16 పరుగులే జట్టులో అత్యధికం కావడం గమనార్హం.

## అక్షర్ పటేల్ చివరి ఓవర్ విన్యాసం

33 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ బ్యాటర్లు భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ విజయం దిశగా సాగారు. చివరి ఓవర్లో జపాన్ విజయానికి 8 పరుగులు అవసరమైన తరుణంలో, భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చెలరేగుతున్న జపాన్ బ్యాటర్లను అడ్డుకునే బాధ్యతను స్టార్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు అప్పగించారు. తీవ్ర ఒత్తిడి నెలకొన్న ఆఖరి ఓవర్లో అక్షర్ పటేల్ తన అనుభవాన్నంతటినీ ఉపయోగించి కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. తొలి రెండు బంతులను డాట్ చేయగా, వైడ్ ద్వారా ఒక పరుగు వచ్చినప్పటికీ తర్వాతి బంతుల్లో సింగిల్స్ మాత్రమే ఇచ్చారు. ఆఖరి బంతికి 4 పరుగులు అవసరమైన సమయంలో అక్షర్ తెలివిగా వేసిన నెమ్మదైన బంతిని బ్యాటర్ సరిగ్గా కనెక్ట్ చేయలేకపోవడంతో కేవలం ఒక పరుగు మాత్రమే వచ్చింది. దీంతో జపాన్ 5 ఓవర్లలో 30 పరుగులకు పరిమితమవ్వగా, భారత్ 2 పరుగుల తేడాతో విజయం సాధించి పరువు నిలబెట్టుకుంది.



# అంతర్జాతీయ క్రికెట్‌కు మార్క్ వుడ్ వీడ్కోలు

**లండన్, సెప్టెంబరు 22 :** ఇంగ్లాండ్ స్టార్ పేసర్ మార్క్ వుడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గాయాల కారణంగా గత ఏడాది కాలంగా ఆటకు దూరంగా ఉన్న 36 ఏళ్ల వుడ్‌కు ఇక టెస్టులు, వన్డేలు ఆడటం సాధ్యం కాదని వైద్యులు సూచించడంతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. 2015లో న్యూజిలాండ్‌తో లార్డ్స్‌లో జరిగిన టెస్టుతో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వుడ్.. 38 టెస్టుల్లో 119 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ తరఫున నాలుగు యాషెస్ సిరీస్‌ల్లో ఆడిన అతడు.. 70 వన్డేల్లో 80 వికెట్లు సాధించాడు. 2019 వన్డే ప్రపంచకప్ విజయంలో వుడ్ కీలక పాత్ర పోషించాడు. ఆ టోర్నీలో 18 వికెట్లు తీసిన అతడు.. 2022 టీ20 ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. ఆ టోర్నీలో నాలుగు మ్యాచ్‌ల్లో 9 వికెట్లు పడగొట్టాడు. టీ20 అంతర్జాతీయాల్లో 38 మ్యాచ్‌లు ఆడి 54 వికెట్లు సాధించాడు. గాయాల నుంచి తిరిగి వచ్చి జట్టులోకి రావడానికి ఎంతో ప్రయత్నించానని వుడ్ తెలిపాడు. "ఇది నాకు సహజమైన ముగింపులా అనిపించింది. ఇంగ్లాండ్ తరఫున ఆడటం నా జీవితంలో గొప్ప గౌరవం" అని పేర్కొన్నాడు. వుడ్ సేవలను ఇంగ్లాండ్ పురుషుల క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ కొనియాడుతూ.. యాషెస్, రెండు ప్రపంచకప్ విజయాల్లో అతడి పాత్రను గుర్తుచేసుకున్నాడు.



# ఆసియా క్రీడల్లో మహిళల బ్యాడ్మింటన్ జట్టు నిష్క్రమణ

నాగోయా (జపాన్), సెప్టెంబరు 22: ఆసియా క్రీడలు 2026 మహిళల బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో భారత ప్రయాణం క్వార్టర్ ఫైనల్స్‌లోనే ముగిసింది. మంగళవారం జరిగిన కీలక క్వార్టర్ ఫైనల్ పోరులో ఆతిథ్య జపాన్ చేతిలో భారత్ 1-3 తేడాతో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. మొదటి సింగిల్స్ మ్యాచ్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, జపాన్ స్టార్ క్రీడాకారిణి అకానె యమగుచి మధ్య హోరాహోరీ పోరు సాగింది. తొలి గేమ్‌ను 23-21తో కైవసం చేసుకున్న సింధు, ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లను 18-21, 11-21 తేడాతో ప్రత్యర్థికి సమర్పించుకోవడంతో జపాన్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత జరిగిన రెండో సింగిల్స్ మ్యాచ్‌లో భారత యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా 16-21, 18-21 తేడాతో టొమోకా మియాజాకి చేతిలో ఓటమి పాలవ్వడంతో జపాన్ ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో మ్యాచ్‌లో బరిలోకి దిగిన భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ - గాయత్రి గోపీచంద్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. జపాన్‌కు చెందిన యుకీ ఫుకుషిమా - మయు మత్సుమోటో జోడీపై 21-17, 21-16 తేడాతో నేరుగా రెండు గేమ్‌లలో విజయం సాధించి భారత్‌ను 1-2తో పోటీలో నిలిపారు. అయితే, నిర్ణయాత్మక నాలుగో మ్యాచ్‌లో తాన్వి శర్మ 12-21, 10-21 తేడాతో జపాన్ క్రీడాకారిణి నోజోమి ఒకుహారా చేతిలో పరాజయం పాలైంది. దీంతో జపాన్ 3-1 తేడాతో విజయాన్ని ఖాయం చేసుకుని సెమీఫైనల్‌కు చేరుకోగా, భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌తోనే తమ పోరాటాన్ని ముగించింది.

# రిజ్వాన్‌పై పీసీబీ ఆంక్షలు

**లాహోర్, సెప్టెంబరు 22:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరియు నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సీఐఏ) సంయుక్తంగా జరుపుతున్న ఆన్‌లైన్ జూదం, అవినీతి ఆరోపణల విచారణ వ్యవహారంలో సీనియర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌పై తీవ్ర ఆంక్షలు విధించబడ్డాయి. ఇంగ్లండ్ పర్యటన మధ్యలోనే స్వదేశానికి రప్పించిన ఏడుగురు ఆటగాళ్లలో ఒకరైన రిజ్వాన్, తనపై వచ్చిన ఆరోపణలపై మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చేందుకు పీసీబీని రెండుసార్లు అనుమతి కోరగా, బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలను చూపిస్తూ ఆ అభ్యర్థనలను నిరాకరించింది. విచారణ ప్రక్రియలో భాగంగా పీసీబీ భద్రతా బృందం స్వాధీనం చేసుకున్న రిజ్వాన్ మరియు ఇమామ్-ఉల్-హక్‌ల మొబైల్ ఫోన్లను ఇప్పటికీ తిరిగి ఇవ్వకుండా, వాటిలోని ఆర్థిక లావాదేవీలు మరియు సంభాషణలపై లోతైన ఫోరెన్సిక్ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో రిజ్వాన్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అవినీతి నిరోధక విభాగానికి లేఖ రాస్తూ, ఈ విచారణలో సరైన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై స్పష్టత కోరారు. అలాగే, విచారణకు పూర్తిగా సహకరిస్తానని, అయితే తనపై ఉన్న ఆరోపణల స్పష్టమైన వివరాలను ముందుగా అందించాలని ఆయన ఎన్‌సీఐఏకు విజ్ఞప్తి చేశారు.





# జాతీయ వేదికపై తెలుగు సినిమా జయకేతనం

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం వైభవం

- తెలుగు చిత్రాలకు తొమ్మిది పురస్కారాలు
- 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప-2', '35' చిత్రాలకు రెండేసి
- ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'
- మమ్ముట్టి, కార్తిక్ ఆర్యన్‌కు ఉత్తమ నటుల పురస్కారం
- యామీ గౌతమ్‌కు ఉత్తమ నటి.. అనంత్ నాగ్‌కు ఫాల్కే పురస్కారం

**ఏక్తానగర్, సెప్టెంబర్ 22:** భారతీయ సినీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో మంగళవారం వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా విజేతలు పురస్కారాలు అందుకున్నారు. ఈసారి తెలుగు సినిమా జాతీయ వేదికపై సత్తా చాటింది. వివిధ విభాగాల్లో తెలుగు చిత్రాలు మొత్తం తొమ్మిది పురస్కారాలను సొంతం చేసుకున్నాయి. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌కు భారతీయ సినిమాకు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని రాష్ట్రపతి ప్రదానం చేశారు. 'భ్రమయుగం' చిత్రంలో నటనకు మమ్ముట్టి, 'చందూ ఛాంపియన్' చిత్రంలో నటనకు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుల పురస్కారాలను అందుకున్నారు. 'ఆర్టికల్ 370'లో నటనకు యామీ గౌతమ్ ఉత్తమ నటిగా నిలిచారు. 'ఆర్టికల్ 370' ఉత్తమ ఫీచర్ చిత్రంగా ఎంపిక కాగా, 'అమరన్'కు రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకున్నారు.

### తెలుగు సినిమాకు తొమ్మిది పురస్కారాలు

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్ర పరిశ్రమ తొమ్మిది అవార్డులతో మెరిసింది. 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప: ది రూల్ పార్ట్-2', '35.. చిన్న కథ కాదు' చిత్రాలకు రెండేసి పురస్కారాలు దక్కాయి. 'కమిటీ కుర్రోళ్లు' కూడా రెండు విభాగాల్లో అవార్డులు సాధించగా, 'లక్కీ భాస్కర్'కు ఒక పురస్కారం లభించింది. 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రంగా నిలిచింది. ఇదే చిత్రానికి నితిన్ జిహానీ చౌధరి ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్‌గా పురస్కారం అందుకున్నారు. 'పుష్ప-2' చిత్రానికి ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగంలో సుకుమార్‌కు పురస్కారం దక్కగా, అదే చిత్రానికి దీపాలి నూర్, శీతల్ శర్మ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా అవార్డు అందుకున్నారు.



### '35'కు రెండు.. 'కమిటీ కుర్రోళ్లు'కు రెండు

'35.. చిన్న కథ కాదు' ఉత్తమ బాలల చిత్రంగా జాతీయ పురస్కారం సాధించింది. ఇదే చిత్రంలో నటించిన అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాల నటుడి పురస్కారాన్ని పంచుకున్నారు. 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కాగా, ఇదే సినిమాకు పి. రవికుమార్ ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా అవార్డు అందుకున్నారు. 'లక్కీ భాస్కర్' చిత్రానికి వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా జాతీయ పురస్కారం అందుకున్నారు. దీంతో తెలుగు సినిమాకు దక్కిన పురస్కారాల సంఖ్య తొమ్మిదికి చేరింది.

### ఢిల్లీ దాటి తొలిసారి గుజరాత్‌లో

జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవానికి ఈసారి గుజరాత్‌లోని ఏక్తానగర్ వేదికైంది. సాధారణంగా ఢిల్లీలో జరిగే ఈ వేడుకను ఈసారి ఏక్తానగర్‌లో నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా దేశవ్యాప్తంగా వివిధ భాషలకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు పురస్కారాలను అందుకున్నారు.

### తెలుగు విజేతలు వీరే

**కల్కి 2898 ఏడీ**
ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రం, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్

**పుష్ప-2**
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్

**35.. చిన్న కథ కాదు**
ఉత్తమ బాలల చిత్రం, ఉత్తమ బాల నటుడు

**కమిటీ కుర్రోళ్లు**
ఉత్తమ తెలుగు చిత్రం, ఉత్తమ మేకప్

**లక్కీ భాస్కర్**
ఉత్తమ సంభాషణల రచన










# నా వల్ల కాలేదు!

## 'ది ప్యారడైజ్' కథానాయిక కయాదు లోహర్ వ్యాఖ్యలు


**హైదరాబాద్, సెప్టెంబరు 22 :** నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ది ప్యారడైజ్' విడుదల కాబోతున్న నేపథ్యంలో, ఆ చిత్రంలో నాని సరసన 'సుబ్బలక్ష్మి' (సుబ్బు) పాత్రలో నటించిన పరభాషా నటి కయాదు లోహర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మీడియాతో ముచ్చటించిన ఆమె, చిత్రంలో తెలంగాణ యాస పలకడంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. సాధారణంగా పరభాషా కథానాయికలు తమ సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పుకుని స్థానిక ప్రేక్షకులకు దగ్గరవ్వాలని ఆశిస్తుంటారు. కయాదు లోహర్ కూడా 'ది ప్యారడైజ్' కోసం సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, చివరకు తెలంగాణ యాస ముందు చేతులెత్తేసినట్లు వెల్లడించారు. సాధారణ తెలుగును నేర్చుకుని మాట్లాడటం సులభమే అయినప్పటికీ, ఈ సినిమాలో కథా నేపథ్యానికి అవసరమైన పక్కా నేటివిటీతో కూడిన స్వచ్ఛమైన తెలంగాణ మాండలికాన్ని పలకడం తనకు ఏమాత్రం సాధ్యపడలేదని చెప్పారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కూడా ఒకసారి డబ్బింగ్ ప్రయత్నించి చూద్దామని ప్రోత్సహించినప్పటికీ, ఎంత ప్రయత్నించినా ఆ స్లాంగ్ సెట్ కాకపోవడంతో డబ్బింగ్ నిర్ణయాన్ని విరమించుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. పాత్ర సహజత్వం దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కథానాయిక స్పష్టం చేశారు.



# హీరోయిన్లకు కాంపిటీషన్ ఇచ్చేలా!

## శ్రీను వైట్ల డాటర్ ఆనంది...

**హైదరాబాద్, సెప్టెంబరు 22 :** టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శ్రీను వైట్ల పెద్ద కుమార్తె ఆనంది వైట్ల సోషల్ మీడియాలో పంచుకున్న లేటెస్ట్ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట తీవ్రంగా వైరల్ అవుతున్నాయి. సరికొత్త కామెడీ ట్రెండ్‌తో 'ఆనందం', 'వెంకీ', 'ఢీ', 'రెడీ', 'దూకుడు' వంటి ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన శ్రీను వైట్ల ప్రస్తుతం శర్వానంద్‌తో 'జార్జ్ క్రిష్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, ఆయన కుమార్తె ఆనంది తన ఫ్యాషన్ సెన్స్‌తో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. నిత్యం డిఫరెంట్ ఫ్యాషన్ స్టేట్‌మెంట్లు, గ్లామరస్ ఫోటోషూట్లతో ఇంటర్నెట్‌లో క్రేజ్ తెచ్చుకుంటున్న ఆనంది, తాజాగా బ్లాక్ కలర్ సీత్రూ షీర్ డ్రెస్‌లో పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇంటర్నేషనల్ పాప్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్‌తో మోడ్రన్ అండ్ స్టైలిష్ వైబ్‌లో ఆమె ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆనంది లుక్స్ చూసిన నెటిజన్లు "హాలీవుడ్ మోడల్ రేంజ్ లుక్స్", "హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని అందం" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. తండ్రి ఇండస్ట్రీలో స్టార్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న నేపథ్యంలో, తనదైన గ్లామర్, మోడ్రన్ అప్పీల్‌తో మెరుస్తున్న ఆనంది వైట్ల త్వరలోనే వెండితెరకు హీరోయిన్‌గా పరిచయమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



# త్వరలోనే నంది అవార్డుల వేడుక

## అమరావతిలో సినిమాలు..

## తిరుపతిలో టీవీ పురస్కారాలు..

### 2017--2024 పెండింగ్ కాలానికి ఏటా నాలుగే పురస్కారాలు

### ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ భరత్ భూషణ్ స్పష్టత

**అమరావతి, సెప్టెంబరు 22 :** తెలుగు సినీ కళాకారులు, సాంకేతిక నిపుణులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అత్యున్నత 'నంది అవార్డుల' ప్రదానోత్సవానికి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. గత దశాబ్ద కాలంగా నిలిచిపోయిన ఈ పురస్కారాల పంపిణీ ప్రక్రియకు ఎట్టకేలకు మోక్షం కలిగిస్తూ ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కీలక ప్రకటన చేసింది. ఇందులో భాగంగా సినిమా రంగానికి సంబంధించిన నంది అవార్డుల వేడుకను రాజధాని అమరావతి వేదికగా, టెలివిజన్ రంగానికి చెందిన పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, 2017 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న ఎనిమిదేళ్ల కాలానికి సంబంధించి ప్రభుత్వం ఒక ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఇచ్చే పదుల సంఖ్యలోని కేటగిరీలన్నింటినీ ఎనిమిదేళ్ల వ్యవధిలోని చిత్రాలకు వేర్వేరుగా పరిశీలించడం సాంకేతికంగా, ఆచరణాత్మకంగా అసాధ్యమని భావించినట్లు ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ భరత్ భూషణ్ వివరించారు. అందువల్ల ఆ మధ్యంతర సంవత్సరాలకు గానూ ఏటా కేవలం నాలుగు అవార్డులు (ఉత్తమ చిత్రం, ద్వితీయ ఉత్తమ చిత్రం, మరొక రెండు ప్రత్యేక జ్యూరీ అవార్డులు) మాత్రమే ప్రదానం చేయనున్నట్లు స్పష్టం చేశారు. దీంతో ఆ ఏడేళ్ల కాలంలో నటన, దర్శకత్వం, సాంకేతిక విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి వ్యక్తిగత నంది




అవార్డులు దక్కే అవకాశం లేకుండా పోవడంతో పరిశ్రమ వర్గాల్లో ఇది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, 2012 నుంచి 2016 కాలానికి సంబంధించి అప్పట్లో ప్రకటించి నిలిచిపోయిన 288 సినీ, 51 జ్యూరీ అవార్డులతో పాటు టెలివిజన్ రంగానికి చెందిన 330 పురస్కారాలను బాకీ లేకుండా అందజేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఇక 2025 నుంచి ఎలాంటి కోతలు లేకుండా ఎప్పటిలాగే అన్ని విభాగాల్లోనూ పూర్తిస్థాయి నంది అవార్డులను యథావిధిగా కొనసాగిస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'గద్దర్ అవార్డుల'తో దీనికి ఎలాంటి సంబంధం లేదని, అక్కడ సత్కారం పొందిన సినిమాలు కూడా ఇక్కడ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈసారి నంది అవార్డుల నగదు ప్రోత్సాహకాన్ని కూడా పెంచుతూ ప్రత్యేక జీవో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644